


చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న కలెక్టర్

వీర వనిత చాకలి ఐలమ్మ
స్ఫూర్తిదాయకం
కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి 6

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



ఖమ్మం

5

శనివారం 27 సెప్టెంబరు 2025



ధనలక్ష్మి అలంకరణలో
దర్శనమిచ్చిన అమ్మవారు

భద్రాచల శ్రీసీతారామచంద్రస్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయ ప్రాంగణంలోని లక్ష్మీతాయారు అమ్మవారు ధనలక్ష్మి అలంకరణలో శుక్రవారం భక్తులకు దర్శనమిచ్చారు. కాగా శనివారం అమ్మవారు ధాన్యలక్ష్మి అలంకరణలో దర్శనమివ్వనున్నారు. 7

పెరుగుతున్న గోదారి

- మధ్యాహ్నం 12గంటలకు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ
- రాత్రి 10గంటలకు 45.50అడుగులకు నీటిమట్టం
- కల్యాణకట్ట దిగువ భాగంలో చేరుతున్న నీరు



కల్యాణ కట్టను తాకిన వరద నీరు



భద్రాచలం వద్ద గోదావరి ఉధృతి

భద్రాచలం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎగువన కురిసిన వర్షాలతో భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం క్రమేపీ పెరుగుతోంది. గురువారం 37అడుగులున్న గోదావరి నీటిమట్టం శుక్రవారం ఉదయం 6గంటలకు 40.8 అడుగులకు చేరుకుంది. అనంతరం 9 గంటలకు 42 అడుగులు రాగా 12 గంటలకు 43అడుగులకు చేరుకోవడంతో కలెక్టర్ జితేష్‌వి పాటిల్ మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. మధ్యాహ్నం 3గంటలకు 43.9, సాయంత్రం 6గంటలకు 44.7, రాత్రి 9గంటలకు 45.40, 10గంటలకు 45.50అడుగులకు గోదావరి నీటిమట్టం చేరుకుంది. ఈ క్రమంలో గోదావరి తీరంలో ఉన్న దేవస్థానం కల్యాణకట్ట కింది భాగంలోకి వరద నీరు చేరుతోంది. గోదావరి స్నానఘట్టాలు పూర్తిగా నీట మునగడంతో భక్తులను నిర్దేశించిన ప్రాంతాల్లోకే అనుమతిస్తున్నారు. కాగా గోదావరి మరో 48 అడుగుల వరకు వచ్చే అవకాశం ఉందని అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి. మొదటి ప్రమాద హెచ్చరిక జారీ కావడంతో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ జితేష్‌వి పాటిల్ ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. అత్యవసర పరిస్థితుల్లో సేవలందించేందుకు ఏపీలోని కృష్ణాజిల్లా టెన్త్ బెటాలియన్ ఎన్డీఆర్‌ఎఫ్ బృందం ఇప్పటికే భద్రాద్రిలో మకాం చేసి ఉంది. రెండు రోజుల క్రితం వారు మాక్‌డ్రిల్‌ను సైతం నిర్వహించి పూర్తి సన్నద్ధతతో ఉన్నారు. ఇదిలా ఉండగా గోదావరి తీరంలో కొందరు సెల్ఫీలు దిగుతున్నారని, అలాంటి వారిని నియంత్రించాల్సిన అవసరం ఉంది.

37 రోజులుగా.. 35 అడుగులు..

- భద్రాచలం వద్ద గోదావరి ప్రవాహ తీరిది
- మూడున్నర దశాబ్దాల క్రితం ఇదే రీతిలో వచ్చిందంటున్న స్థానికులు

7

సత్తుపల్లిలో క్రిప్టో కరెన్సీ
కలకలం!

- ఓ రైతు ఖాతా నుంచి రూ.31కోట్ల లావాదేవీలు?
- ఖమ్మంలోని ఓ ఫార్మసీ యజమాని కూడా ఉన్నాడంటూ ప్రచారం
- ఐటీ దాడులు జరిగాయంటూ సోషల్ మీడియాలో వైరల్

సత్తుపల్లి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : క్రిప్టో కరెన్సీ లో పెట్టుబడులు పెట్టడం ద్వారా సత్తుపల్లికి చెందిన ఒక రైతు ఖాతా నుంచి రూ.31కోట్లు, అలాగే ఖమ్మం నగరానికి చెందిన ఒక ఫార్మసీ యజమాని ఖాతా నుంచి కూడా పెద్ద మొత్తంలో లావాదేవీలు జరిగాయన్న ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో ఆదాయపన్ను శాఖ రంగంలోకి దిగిందని, విచారణ ముమ్మరం చేసిందన్న వార్త సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. క్రిప్టోకరెన్సీలో పెట్టుబడుల ద్వారా వచ్చిన లాభాలు పెద్ద మొత్తంలో రావటంతో సత్తుపల్లికి చెందిన ఒక రైతు ఖాతా నుంచి రూ.31కోట్లు, ఖమ్మంలోని ఒక ఫార్మసీ యజమాని ఖాతా నుంచి రూ.కోట్లలో లావాదేవీలు జరిగినట్లు ఐటీ శాఖ గుర్తించిందని సోషల్ మీడియాలో శుక్రవారం విస్తృతంగా ప్రచారం జరిగింది. సోషల్ మీడియాలో జరిగిన ఈ ప్రచారంతో సత్తుపల్లికి చెందిన ఆ రైతు ఎవరు అనే విషయంపై స్థానికంగా చర్చ సాగుతోంది. అలాగే ఖమ్మంలోని ఫార్మసీ యజమాని ఎవరనే విషయంపై సత్తుపల్లి ప్రాంతానికి చెందిన మెడికల్ షాపుల యజమానులు ఆరా తీస్తున్నారు. అసలు ఇందులో నిజమెంత? అంతమొత్తంలో లావా దేవీలు నిజంగానే జరిగాయా? రైతు, ఫార్మసీ యజమానులెవరు? అనే అంశాలపై ఏ ఒక్క అధికారి కూడా ధ్రువీకరించలేదు. హైదరాబాద్‌లో జరిగిన తనిఖీల్లో విషయం బయటపడిందని కొందరు, సత్తుపల్లిలోనే ఐటీ దాడులు జరిగాయని కొందరు ప్రచారం చేస్తున్నారు.

మద్యం షాపుల నోటిఫికేషన్ శుక్రవారం విడుదలైంది. దీంతో దరఖాస్తుల ప్రక్రియ మొదలవగా తొలిరోజు ఒక్క దరఖాస్తు కూడా అందలేదు. ఆసక్తి కలవారు దరఖాస్తు చేసుకునేందుకు వచ్చేనెల 18వతేదీ గడువు ఉందని జిల్లా ఎక్సైజ్‌శాఖ అధికారి నాగేంద్ర రెడ్డి నోటిఫికేషన్‌లో వెల్లడించారు. జిల్లాలో మొత్తం 116 మద్యం షాపులకు దరఖాస్తులు స్వీకరణ కార్యక్రమం షురూ కాగా.. లక్కీ డ్రా పాల్గొనే దరఖాస్తు ఫీజు రూ.3లక్షలుగా నిర్ణయించారు. లాటరీ పద్ధతిలో మద్యం షాపు వచ్చిన వారికి షాపు కేటాయిస్తారు. షాపులు దక్కని వారు దరఖాస్తు రుసుంగా చెల్లించిన రూ.3లక్షలు వదులుకోవాల్సిందే.



తొలిరోజు నిల్..

- మద్యం షాపులకు దరఖాస్తుల స్వీకరణ షురూ
- మొదటిరోజు అందని అప్లికేషన్లు.. వచ్చేనెల 18వతేదీ ఆఖరు
- దుకాణాలు దక్కించుకునేందుకు సై అంటున్న సిండికేట్లు
- జిల్లా షాపులపై ఏపీ మద్యం వ్యాపారుల దృష్టి

ఖమ్మం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతిప్రతినిధి) : 2025-27సంవత్సరానికి గాను మద్యం షాపులు దక్కించుకునేందుకు వ్యాపారులు ఉవ్విళ్లూరుతున్నారు. దరఖాస్తు రుసుంగా రూ.3లక్షలను జిల్లా ఎక్సైజ్ అధికారి పేరుతో డీడీ తీయాల్సి ఉంటుంది. పాన్‌కార్డు, ఆధార్‌కార్డు, రిజర్వ్‌డ్ షాపుల కోసం దరఖాస్తు చేసుకునేవారు కుల ధ్రువీకరణ పత్రాలను తప్పనిసరిగా జతచేయాలి. దరఖాస్తుదారులు తమ అప్లికేషన్లను ఖమ్మం నగరంలోని కొత్తకూరగాయల మార్కెట్ పక్కన ఎక్సైజ్ స్టేషన్‌లో అందించాల్సి ఉంటుంది. అక్టోబరు 18వతేదీ వరకు దరఖాస్తులు స్వీకరించిన అనంతరం 23న ఉదయం 11గంటలకు ఖమ్మంలోని లేక్‌వ్యూ ఫంక్షన్‌హాల్‌లో డ్రా తీయనున్నారు. జిల్లాలో రెండేళ్ల క్రితం నిర్వహించిన టెండర్లలో 116 షాపులకు 7,207 దరఖాస్తులు రాగా రూ.144.14కోట్ల ఆదాయం సమకూరింది. ఈసారి దరఖాస్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

ఆంధ్రా వ్యాపారుల చూపు జిల్లాలోని మద్యం షాపులను దక్కించుకునేందుకు...

ఉమ్మడిజిల్లా వ్యాపారులతో పాటు పొరుగున ఉన్న ఏపీలోని పలు జిల్లాల మద్యం వ్యాపారులు షాపులు దక్కించుకునేందుకు సిండికేట్‌కు సై అంటున్నారు. ఖమ్మం అర్బన్‌లో మద్యం షాపులకు రూ.65లక్షలు, మండలాల్లో షాపులకు రూ.55లక్షలు, కొన్ని మండలాల్లో రూ.50లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. జిల్లాలో కొన్ని షాపులు గౌడకులస్థులు, ఎస్సీ, ఎస్టీలకు రిజర్వుచేశారు. ఏజెన్సీ ప్రాంతలో పూర్తిగా గిరిజనులకే కేటాయించారు. గతంలో కూడా ఏపీ వ్యాపారులు ఖమ్మం జిల్లా వ్యాపారులతో సిండికేట్ అయి షాపులు పొందారు. అందరూ కలిసి పెద్దసంఖ్యలో దరఖాస్తులు వేసి.. అందులో ఎవరికి షాపు వచ్చినా.. అందరూ వాటాలు కలిగి ఉండేలా షాపు నిర్వహించే ఆనవాయితీ వస్తోంది. ఒక్కొక్కరుగా దరఖాస్తు చేస్తే షాపు లాటరీలో రాకపోతే రూ.3లక్షలు నష్టపోయే ప్రమాదం ఉండటంతో సిండికేట్‌గా మారి మద్యం టెండర్ల ప్రక్రియలో పాల్గొనేందుకు ఉత్సాహం చూపుతున్నారు. ఎక్సైజ్‌శాఖ అధికారులు కూడా దరఖాస్తులు పెద్దసంఖ్యలో వస్తేనే ఆదాయం కూడా అదే స్థాయిలో ఉంటుందని చెబుతున్నారు. అయితే ఈసారి దరఖాస్తు రుసుం రూ.3లక్షలకు పెంచడంతో సాధారణ దరఖాస్తుదారులపై ఆర్థిక భారం పడుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

లంచం అడిగాడు..
ఏసీబీకి చిక్కాడు..

- స్టేషన్ బెయిల్‌కు రూ.40వేలు డిమాండ్ చేసిన మణుగూరు ఎస్ఐ
- బాధితుడిచ్చిన ఆధారాలతో రంజిత్ అరెస్టు
- వివరాలు వెల్లడించిన ఏసీబీ ఇన్‌చార్జ్ డీఎస్పీ విజయ్‌కుమార్

మణుగూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్టేషన్ బెయిల్ మంజూరు విషయమై ఓ వ్యక్తి వద్ద రూ.40వేలు డిమాండ్ చేసిన మణుగూరు ఎస్ఐ బత్తుల రంజిత్‌ను శుక్రవారం ఏసీబీ పోలీసులు అరెస్టు చేశారు. కరీంనగర్ ఏసీబీ డీఎస్పీ, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ డీఎస్పీ విజయ్‌కుమార్ దీనికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. మణుగూరు మండలంలోని విజయనగరం గ్రామానికి చెందిన శ్యామల కృష్ణ అనే వ్యక్తి ఖమ్మం నగరానికి చెందిన మొండి బాలరాజు వద్ద నాలుగు కార్లను అద్దెకు తీసుకున్నాడు. ఈ క్రమంలో అద్దె డబ్బులు చెల్లించకుండా, కార్లను తిరిగివ్వకుండా శ్యామల కృష్ణ బాలరాజును ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. విసిగిపోయిన బాలరాజు.. శ్యామల కృష్ణపై మణుగూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. కృష్ణపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో శ్యామల కృష్ణకు స్టేషన్ బెయిల్ ఇచ్చేందుకు ఎస్ఐ రంజిత్ అతడి వద్ద రూ.40వేలు డిమాండ్ చేశారు. ఈ క్రమంలో శ్యామలకృష్ణ ఎస్ఐ రంజిత్ తనను లంచం అడిగాడని, అందుకు ఆధారాలుగా ఆడియో,



ఏసీబీ అధికారులు అరెస్టు చేసిన ఎస్ఐ రంజిత్

వీడియో టేప్‌లను చూపుతూ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. దీనిపై విచారణ చేపట్టిన ఏసీబీ డీఎస్పీ విజయ్‌కుమార్ కృష్ణ చూపిన ఆధారాలు నిజమేనని తేలడంతో గురువారం మధ్యాహ్నం మణుగూరు స్టేషన్‌లో విధుల్లో ఉన్న ఎస్ఐ రంజిత్‌ను అదుపులో తీసుకున్నారు. లంచం అడిగినట్టు ఆధారాలు లభించడంతో ఎస్ఐపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ విజయకుమార్ తెలిపారు.

ఏసీబీ దాడులు.. ఇది రెండో సారి...

మణుగూరులో గత సీఐ సతీష్ రూ.4 లక్షలు మధ్యవర్తి ద్వారా లంచం తీసుకున్న క్రమంలో అతడిని ఏసీబీ అధికారులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. మణుగూరు స్టేషన్ చరిత్రలో ఏసీబీ దాడులు జరగడం అదే ప్రథమం కాగా.. శుక్రవారం ఎస్ఐ రంజిత్ పట్టుబడిన ఘటన రెండోది. అసలు స్టేషన్ బెయిల్ విషయంలో పైస్థాయి అధికారులదే తుది నిర్ణయం ఉంటుండగా.. రంజిత్ రూ.40వేల లంచం డిమాండ్ చేయడంపై చర్చ జరుగుతోంది. అంటే ఈ లంచం డిమాండ్ వెనుక పై స్థాయి అధికారులు ఎవరైనా ఉన్నారా.. అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతుండగా.. అరెస్టు వివరాలు వెల్లడించిన ఏసీబీ డీఎస్పీ మాత్రం ఇందులో మరే ఇతర అధికారుల ప్రమేయం లేదని చెప్పడం గమనార్హం.

పాఠాలు చెప్పనీయండి మహాప్రభో..

- వీసీలు, జూమ్ మీటింగులతో తరిగిపోతున్న కాలం
- ఆ పై శిక్షణలు, సమావేశాలతో సరి
- బోధనకు ఆటంకంగా మారుతోందంటున్న ప్రభుత్వ టీచర్లు
- దసరా సెలవుల తర్వాత ఎస్ఏ పరీక్షలు

కొత్తగూడెం ఎడ్యుకేషన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలలు ప్రారంభమై నాలుగు నెలలు గడిచినా.. విద్యార్థులు చదువులు ఎంతకూ ముందుకు సాగడం లేదు. బోధన, బోధనేతర పనులతోనే పుణ్యకాలం సరిపోతోందని.. దీని వల్ల పాఠ్యాంశాలు బోధించడానికి తీవ్ర ఆటంకంగా మారిందని పలువురు ప్రభుత్వ ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే విద్యాశాఖ ఈ నెల 21 నుంచి దసరా సెలవులు కూడా ప్రకటించింది. సెలవుల్లో విద్యార్థుల చదువులు అంతంత మాత్రంగానే ఉంటాయి. ఇక స్టూడెంట్స్ ఎప్పుడు విద్య వైపు దృష్టి పెడతారని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు.. ప్రైవేట్ పాఠశాలల్లో గత నాలుగు నెలల నుంచి ఉపాధ్యాయులు బోధన వైపు దృష్టి పెట్టి వచ్చే నవంబరు నాటికి సిలబస్ పూర్తి చేయడానికి సిద్ధమయ్యారు. 9, 10 తరగతి విద్యార్థులకు రివిజన్ వైపు కూడా దృష్టి పెట్టినట్టు తెలుస్తోంది. అందుకే ప్రైవేట్ పాఠశాలల్లో ఉత్తీర్ణతా శాతం పెరుగుతోందని ఉపాధ్యాయులు అంటున్నారు. 2025-2026 విద్యా సంవత్సరం ఆరంభానికి ముందే మే, జూన్ నెలలో ఉపాధ్యాయులకు ఐదు రోజుల పాటు వృత్యాంతర శిక్షణలు నిర్వహించారు. జూన్ నెలలో బడిబాట కార్యక్ర



మాలు, ర్యాలీలు, సమావేశాలు, అలాగే జూలైలో విత్తనాల సేకరణ, హరితహారం, పాఠశాలల్లో మొక్కలు నాటడం, ఇంకుడు గుంతలు తీయడం, స్వచ్ఛ భారత్, స్వేచ్ఛ భారత్, నేషనల్ గ్రీన్ వకార్ప్స్, ఇక ఆగస్టు నెలలో తల్లిదండ్రుల సమావేశాలు, వివిధ పథకాలకు సంబంధించిన వ్యాసరచన, చిత్రలేఖన మండల, జిల్లా స్థాయి పోటీలతో పాటు ఉపాధ్యాయులకు వివిధ అంశాలపై శిక్షణలు, సెప్టెంబరు నెలలో తలా ఉత్సవాలు, సైన్స్ సెమినార్లతో పాటు ఇన్‌స్పైర్ మనాక్ నామినేషన్లు, రిజిస్ట్రేషన్లు, ఎకో క్లబ్స్, పాఠశాల స్థాయిలో గ్రూపుల ఏర్పాటు బాధ్యత తదితర పనుల్లో ప్రభుత్వ ఉపాధ్యాయులు నిమగ్నమయ్యారు. ఇది చాలదన్నట్టు ఎఫ్ఆర్ఎస్ మధ్యాహ్న భోజనం, విద్యార్థులకు దుస్తులు, (మిగతా 6వ పేజీలో)





బతుకమ్మలకు పూజలు నిర్వహిస్తున్న జడ్పీ సీఈవో దీక్షారైనా, కలెక్టరేట్‌లో బతుకమ్మ ఆడుతున్న ఎమ్మెల్యే రాగమయి, తదితరులు

ఘనంగా బతుకమ్మ వేడుకలు

- జడ్పీలో జరిగిన సంబురాల్లో పాల్గొన్న సీఈవో దీక్షా రైనా
- కలెక్టరేట్‌లో వ్యవసాయ, ఉద్యానశాఖల ఆధ్వర్యంలో వేడుకలు

ఖమ్మం కలెక్టరేట్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి) : తెలంగాణ సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీకగా నిర్వహించే బతుకమ్మ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. జిల్లా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన వేడుకల్లో జడ్పీ సీఈవో దీక్షరైనా అధికారులు, సిబ్బందితో కలిసి పాల్గొన్నారు. తొలుత బతుకమ్మలకు ఆమె ప్రత్యేకంగా పూజలు చేశారు. అనంతరం కోలాటాలు వేసుకుంటూ బతుకమ్మ పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మహిళా అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే వ్యవసాయ, మార్కెటింగ్, ఉద్యానశాఖల ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహిళా అధికారులు, ఉద్యోగులు పెద్దసంఖ్యలో హాజరైన ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి పాల్గొని బతుకమ్మలకు పూజలు నిర్వహించి ఆగిపాడారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమంతరావు, జిల్లా మార్కెటింగ్ అధికారి ఎంఏ అలీమ్, ఆంజనేయులు, వ్యవసాయశాఖ అధికారులు ఏడీఏలు వాసవీరాణి, కరుణశ్రీ, కొంగరవెంకటేశ్వర్లు, వాణిశ్రీ, ఏవో ప్రత్యూష, ఏఈవోలు పాల్గొన్నారు.

నేటి నుంచి ఖమ్మం మార్కెట్‌కు 'దసరా' సెలవులు

ఖమ్మం మార్కెట్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌కు శనివారం నుంచి అక్టోబరు 5 వరకు వరుసగా తొమ్మిది రోజులు సెలవులు ఉన్నట్లు మార్కెట్ సెక్రెటరీ ప్రవీణ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. దుర్గాష్టమి, దసరా, వారాంతపు సెలవుల సందర్భంగా వరుసగా 9 రోజులు సెలవు ఉన్నట్లు ఆయన తెలిపారు. మార్కెట్‌లో తిరిగి అక్టోబరు 6 సోమవారం నుంచి యథావిధిగా క్రయ, విక్రయాలు ఉంటాయని ఆయన తెలిపారు. రైతులు సెలవుల విషయాన్ని గ్రహించాలని కోరారు.

సౌత్‌జోన్ అథ్లెటిక్స్ పోటీల్లో వైశాలికి స్వర్ణం



స్వర్ణ పతకం సాధించిన వైశాలి(సర్కిల్‌లో ఉన్న క్రీడాకారిణి)

ఖమ్మం స్పోర్ట్స్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరు నాగార్జున యూనివర్శిటీలో ఈనెల 23 నుంచి 25 వరకు జరిగిన సౌత్‌జోన్ అథ్లెటిక్స్ పోటీలలో ఖమ్మం జిల్లాకు చెందిన అథ్లెట్ వైశాలి ప్రతిభ చూపి స్వర్ణ పతకం సాధించింది. తెలంగాణ రాష్ట్ర జట్టు తరుపున ప్రాతినిథ్యం వహించిన ఆమె అండర్-18 హెప్టాథ్లాన్ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా పతకం సాధించిన ఆమెను డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రటరీ షఫీ, కోచ్ గౌస్ తదితరులు అభినందించారు. భవిష్యత్ పోటీలలో రాణించి ఖమ్మం జిల్లాకు ఖ్యాతిని తీసుకురావాలని ఆకాంక్షించారు.

దసరా ప్రత్యేక సర్వీస్‌లకు లక్కీడ్రా

» కొత్తగూడెం ఆర్టీసీ డీఎం రాజ్యలక్ష్మి


మాట్లాడుతున్న కొత్తగూడెం ఆర్టీసీ డీఎం రాజ్యలక్ష్మి

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, సెప్టెంబరు26(ఆంధ్రజ్యోతి): దసరా పండు గ సందర్భంగా ఆర్టీసీ బస్సులలో ప్రయాణం చేసిన వారికి ప్రత్యేక నగదు బహుమతులు ఏర్పాటు చేశామని కొత్తగూడెం డిపో మేనేజర్ యు.రాజ్యలక్ష్మి శుక్రవారం తెలిపారు. తెలంగాణ రాష్ట్ర రోడ్ రవాణా సంస్థ శనివారం నుంచి వచ్చే నెల 6వ తేదీ వరకు పది రోజులు ప్రత్యేక సర్వీసులు నడపడానికి అవసరమైన అన్ని చర్యలను తీసుకున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా ఆర్టీసీ బస్సులలో ప్రయాణం చేసే ప్రయాణికులకు నగదు బహుమతిని అందించే ప్రత్యేకమైన లక్కీ డ్రా పథకాన్ని తీసుకువచ్చిందన్నారు. ఈ స్కీం ప్రకారం డీలక్స్, సూపర్ లగ్జరీ, రాజధాని ఏ.సీ, నాన్ ఏసీ లహరి ఏ.సీ, నాన్ ఏసీ బస్సులలో ప్రయాణం చేసే ప్రయాణికులు అర్హులన్నారు. సదరు బస్సులలో ప్రయాణం చేసే ప్రయాణికులు, తమ ప్రయాణ అనంతరం సదరు టిక్కెట్ వెనుక భాగంలో ప్రయాణికుడి పేరు, ఫోన్ నెంబరు, అడ్రస్‌ను నమోదు చేసి సదరు టిక్కెట్టును బస్ స్టేషన్‌లో అనగా కొత్తగూడెం డిపో పరిధిలో కొత్తగూడెం, పాల్వంచ, ఇల్లందు బస్టాండ్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేయబడిన ప్రత్యేక లక్కీ డ్రా బాక్స్‌లలో వేయాలన్నారు. ఈ లక్కీ డ్రా కార్యక్రమం వచ్చే నెల 8న ఖమ్మంలోని రీజినల్ మేనేజర్ కార్యాలయంలో నిర్వహించబడుతుందని తెలిపారు. ముగ్గురు అదృష్టవంతులైన ప్రయాణికులను ఈ సందర్భంగా విజేతలుగా ఎంపిక చేసి బహుమతులు అందజేస్తామన్నారు. మొదటి రూ.25 వేల నగదు, రెండవ రూ.15 వేల నగదు, మూడవ బహుమతిగా రూ.10 వేలు నగదు ను అందించబడుతుందని డీఎం తెలిపారు.

మారనున్న 'పేట' మునిసిపాలిటీ రూపురేఖలు

» రూ. 15 కోట్లు మంజూరు
» మునిసిపాలిటీ కార్యాలయం, ఇతర అభివృద్ధి పనులకు కేటాయింపు

అశ్వారావుపేట, సెప్టెంబరు 26(అశ్వారావుపేట): నియోజకవర్గ కేంద్రం, మునిసిపాలిటీగా రూపాంతరం చెందిన అశ్వారావుపేట రూపురేఖలు పూర్తిగా మారనున్నాయి. మునిసిపాలిటీ అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.15కోట్లును మంజూరు చేసింది. ఇప్పటికే ఆ నిధులతో చేపట్టే పనులను ఇటీవల ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ప్రకటించారు. ఇప్పటికే అశ్వారావుపేట సుందరీకరణలో భాగంగా ఖమ్మం రోడ్డు నుంచి భద్రాచలం, జంగారెడ్డిగూడెం వైపునకు వెళ్లే రోడ్డు విస్తరణ పనులు, సెంట్రల్ లైటింగ్ పనులు దాదాపుగా పూర్తి కావస్తుంది. ఈ పనులకు దాదాపుగా రూ.30 కోట్లు వెచ్చించి నిర్మిస్తున్నారు. మునిసిపాలిటీల అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం కేటాయించిన రూ.15కోట్లలలో రూ.7కోట్లతో మునిసిఫల్ కార్యాలయాన్ని పాత ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. రూ.5కోట్లతో దొంతికుంట చెరువు, కట్ట అభివృద్ధి, సుందరీకరణ పనులను చేపడుతున్నారు. పాత ప్రభుత్వ ఆసుపత్రి ప్రదేశంలో కోటి రూపాయలు వెచ్చించి కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం ఉన్న సంత పాకలలో నాన్ వెజ్ మార్కెట్‌ను ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన చేస్తున్నారు. రూ.50 లక్షలు వెచ్చించి బస్టాండు ప్రాంతంలో ఒకటి, సంత పాకల పరిసరాలలో మరొక పబ్లిక్ టాయిలెట్స్‌ను నిర్మించనున్నారు. ఇవి కాక పట్టణంలో రూ.1.50కోట్లతో సీసీ రహదారులు, సైడు డ్రైన్‌లు నిర్మించనున్నారు. ఈ పనులకు ఇప్పటికే ప్రతిపాదనలు వెళ్లాయి. కొన్నింటికి స్థలాల బదలాయింపు వంటి కార్యక్రమాలు జరుగుతున్నాయి. త్వరలోనే టెండరు షెడ్యూల్ జారీ చేయడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇవన్నీ పూర్తి అయితే త్వరలోనే అశ్వారావుపేట మునిసిపాలిటీ రూపురేఖలు పూర్తిగా మారి పోనున్నాయి. తెలంగాణాకు గుమ్మంగా వున్న అశ్వారావుపేట ఏపీ నుంచి వచ్చే వారికి కనులవిందు చేయనుంది.



త్వరలోనే రూ.15కోట్లతో అభివృద్ధి పనులు చేపడతాం...

● నాగరాజు, కమిషనర్



అశ్వారావుపేట మునిసిపాలిటీకి ప్రభుత్వం రూ.15కోట్లు అభివృద్ధి పనుల కోసం కేటాయించడం జరిగిందని, మునిసిపల్ కార్యాలయం, వెజ్ మార్కెట్‌ను నిర్మించే స్థలాల అనుమతికోసం ప్రయత్నాలు సాగుతున్నాయన్నారు. త్వరలోనే టెండర్ ప్రక్రియ ప్రారంభం అవుతుందని ఆయన తెలిపారు.

అశ్వారావుపేటను అభివృద్ధి చేయడమే నా లక్ష్యం

● ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

అశ్వారావుపేట పట్టణానికి తీర్చి దిద్దడం ద్వారా ఏపీ నుంచి వచ్చేవారికి ఆహ్లాదకరంగా కనిపించేలా చేయాలని, సుందరంగా తీర్చిదిద్దాలని తన లక్ష్యం. మునిసిపాలిటీలో అభివృద్ధి పనులు కోసం రూ.15 కోట్లు మంజూరయ్యాయని, ఇప్పటికే సెంట్రల్ లైటింగ్ పనులు పూర్తి కానున్నాయని తెలిపారు. అదనంగా సీసీ రహదారులు, సైడు డ్రైన్స్, ఇందిరమ్మ ఇళ్లు కూడా మునిసిపాలిటీ పరిధిలోని లబ్ధిదారులకు అందజేస్తామని ఆయన అన్నారు.

ఆర్థిక సంస్కరణల రూపకర్త మన్మోహన్‌సింగ్

» టీపీసీసీ సభ్యుడు జేబీ శౌరీ

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, సెప్టెంబరు26(ఆంధ్రజ్యోతి): భారతదేశ ఆర్థిక సంస్కరణల రూపకర్త మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ అని టీపీసీసీ సభ్యుడు జేబీ శౌరీ కొనియాడారు. శుక్రవారం భద్రాద్రి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు, ఫారెస్ట్ డెవెలప్మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ పొదెం వీరయ్య ఆదేశానుసారం మన్మోహన్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ మాజీ ప్రధానమంత్రిగా, దూరదృష్టి కలిగిన ఆర్థిక వేత్తగా, శాంతస్వభావి నాయకుడిగా గుర్తింపు పొందారని, ఆయన నాయకత్వంలో భారత్ ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ప్రత్యేక స్థానం సంపాదించిందని అన్నారు. అనంతరం ప్రజా పోరాటయోధుడుగా, అణగారిన వర్గాల హక్కుల కోసం తన జీవితాన్ని అర్పించిన చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా ఘనంగా ఆమెకు నివాళులర్పించారు. ప్రతి తరానికి స్ఫూర్తిదాయకమని, ఇలాంటి మహానుబావుల జీవితం కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడు స్ఫూర్తిగా తీసుకుంటుందని, వారి జ్ఞాపకాలను స్మరించుకొని, వారు చూపిన దారిలో ముందుకు సాగాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఓబీసీ సెల్ ఛైర్మన్ అల్లాడి నరసింహారావు, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షులు అజ్మీర సురేష్, నాయకులు గౌస్‌మోహి నుద్దీన్, తంగెళ్ళ లక్ష్మణ్, ఈశ్వర్, నిస్సార్, మోరే రమేష్ , సైమన్ గాండ్ల సురేష్, కుప్పరపు నరసింహారావు, అశోక్, ఎండి కాజా, ఎండి.దావూద్, అన్నారపు రవికుమార్, నయీం, ఉర్సు శివ తదితరులు పాల్గొన్నారు.


మన్మోహన్‌సింగ్, చాకలి ఐలమ్మ చిత్ర పటాలకు నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి

కొత్తగూడెం ఎడ్యుకేషన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువులపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వారి ప్రవర్తనపై ఎప్పటికప్పుడు గమనించాలని ఇంటర్మీడియట్ నోడల్ అధికారి హెచ్. వెంకటేశ్వరరావు కోరారు. డైరెక్టర్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ హైదరాబాద్ వారి ఆదేశానుసారం జిల్లాలో ఉన్న 14 ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం పేరెంట్స్, టీచర్స్ సమావేశాలు జరిగాయి. వీటిలో భాగంగా శుక్రవారం కొత్తగూడెంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పేరెంట్ టీచర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నోడల్ అధికారి మాట్లాడుతూ జూనియర్ కళాశాలలో చదివే విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాల గురించి తల్లిదండ్రులకు వివరించారు. విద్యార్థుల చదువులు కేవలం అధ్యాపకులకే వదిలివేయకుండా, తల్లిదండ్రులు కూడా తమ పిల్లలు ఇంటి వద్ద చేసే పనులు గమనించాలని ఆయన కోరారు. ఎప్పటికప్పుడు కళాశాలలకు వచ్చి తమ పిల్లల ప్రగతి నివేదికలు ఏ విధంగా ఉన్నాయో స్వయంగా తెలుసుకోవాలని కోరారు. విద్యార్థులు ఇంటికి వచ్చిన తర్వాత కూడా చదివే విధంగా తగిన జాగ్రత్తలు తీసుకోలవాలని సూచించారు. ఆన్‌లైన్ తరగతుల గురించి వివరించారు. ఈ సమావేశంలో అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

చట్టాలను ఉపయోగించుకోవాలి

ఇల్లెందుటౌన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మహిళలు తమకు ఉన్న చట్టాలను ఉపయోగించుకొని రక్షణ పొందాలని కొత్తగూడెం కోర్టు న్యాయవాది సునంద, పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంగ సూచించారు. రాజకీయ శిక్షణ తరగతులు శుక్రవారం ఇల్లెందు కరెంట్ ఏరియాలో కామ్రేడ్ ఆదిలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. మహిళలకు అన్యాయం జరిగినప్పుడు అనేక చట్టాలు ఉన్నాయని, గృహహింస చట్టం-2003 లైంగిక వేధింపులు, వరకట్నం నిషేధం ఇలావి అనేక చట్టాలు ఉన్నాయని అన్నారు.

మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళ నాయకులు కోటమ్మ, సూర్యకాంత, వినోద, రాములమ్మ, చంద్రకళ, మణెమ్మ, రుక్మిణి, సుగుణ, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంగ

ఆకర్షణీయ మోసాలు!



» పండుగల వేళ మార్కెట్లో మాయాజాలం
» ఆఫర్ల పేరుతో వినియోగదారులకు వల
» కొనుగోళ్లలో అప్రమత్తంగా ఉండాల్సిందే
» ముఖ్యంగా నిత్యావసరాల్లో జాగ్రత్తలు అవసరం

కొత్తగూడెం అర్బన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : బతుకమ్మ వేడుకలు.. దసరా పర్వదినం ఆతర్వాత దీపావళి.. ఇలా వరుస పండుగల నేపథ్యంలో తినుబండారాలు, వస్తువులు, వస్త్రాలు, బంగారం, ఎలక్ట్రానిక్ వస్తువులు, నిత్యావసరాలు, కూరగాయలు, పండ్లు ఇలా నిత్యం రూ.కోట్లలో వ్యాపారం జరుగుతుంది. ఈ క్రమంలో ప్రజలను ఆకర్షించేందుకు వ్యాపారులు ఆఫర్లు ప్రకటిస్తుంటారు. తూనికలు, కొలతలు, ప్యాకింగ్ తదితర నిబంధనలు పాటించకుండా అమ్మకాలు సాగిస్తూ సొమ్ము చేసుకుంటున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఈ క్రమంలో వినియోగదారులు అప్రమత్తంగా ఉండాల్సిందే. కొన్ని వస్తువులకు రెండుమార్లు బిల్లు వేయడం, కొనుగోలు చేయని వాటిని సైతం బిల్లులో చేర్చడం లాంటి మోసాలకు పాల్పడుతుంటారు. ఇక కేంద్రప్రభుత్వం సవరించిన జీఎస్టీ ఈనెల 22 నుంచి అమలులోకి వచ్చింది. ఆ మేరకు ఆయా వస్తువులకు జీఎస్టీ తగ్గించి విక్రయించాలి. వినియోగదారులు జీఎస్టీ, కొనుగోలు చేసిన వస్తువులను, బిల్లులను జాగ్రత్తగా గమనించిన తర్వాత డబ్బులు చెల్లించాలి. 2025-26 ఆర్థిక సంవత్సరంలో నేటివరకు 73కేసులు నమోదు కాగా.. రూ. 4.01లక్షలు అపరాధరుసుం కింద తూనికలు, కొలతలు శాఖ అధికారులు ఖజానాకు జమచేశారు.

పరిశీలించాల్సిన అంశాలు ఇవే..

ప్యాకింగ్ రూపంలో విక్రయించే వాటిపై పాత స్టిక్కర్ల స్థానంలో కొత్తవి వేయడం, దిద్దివేతలు లాంటివి చేసి అమ్మకాలు సాగిస్తుంటారు. ఒకటి కొనుగోలు చేస్తే మరొకటి ఉచితం అంటూ వినియోగదారులను ఆకర్షించే ప్రకటనలు చేస్తుంటారు. మార్కెట్‌లో పాత రకపు త్రాచు, బండరాళ్లను కాటా బాట్లుగా ఉపయోగిస్తుంటారు. దీంతో తూకంలో తేడాలు ఉంటాయి. ఎలక్ట్రానిక్ యంత్రాల్లో కొలతలు ఒకే విధంగా ఉండటం లేదు. అనుమానం కలిగితే మరోక చోట తూకం వేయించుకోవాలి. ప్రస్తుతం సూపర్‌మార్కెట్లు, దుకాణాలు, సంతల్లో అధికంగా ప్యాకింగ్ రూపంలో వస్తువులు విక్రయిస్తుంటారు. కాని కొన్ని చోట్ల నిబంధనలు పాటించడం లేదు. విక్రయించే వస్తువులకు సంబంధించి సంస్థ చిరునామా, అందులో ఏమేం ఉన్నాయి. వస్తువు పరిమాణం, చిరునామా, పిన్‌కోడ్, ధర, గడువు తేది, కస్టమర్ కేర్ నెంబర్, తయారీ కేంద్రం, తదితర వివరాలను వినియోగదారులు తప్పనిసరిగా చూసుకోవాలి.



భద్రాద్రి జిల్లాలో నమోదైన కేసుల వివరాలు ఇలా..

సంవత్సరం	కేసులు	జరిమానా (లక్షల్లో)
2016-17	349	11.07
2017-18	457	19.49
2018-19	438	20.14
2019-20	385	21.91
2020-21	280	15.57
2021-22	381	15.81
2022-23	374	15.97
2023-24	407	16.51
2024-25	404	16.60
2025-26(ఆగష్టు)	73	4.01

ఫిర్యాదు చేయాలి

కె.మనోహార్, తూనికలు - కొలతల శాఖ, భద్రాద్రి జిల్లా అధికారి

ప్రజలు.. వస్తువులపై ముద్రించిన ధర కంటే అధికంగా విక్రయించడం, ప్యాకింగ్ వివరాలు లేకపోతే మా దృష్టికి తీసుకురావాలి. అలాంటి దుకాణాలు, యజమానులపై కేసులు నమోదు చేస్తాం. ప్యాకింగ్ రూపంలో విక్రయించాలంటే తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలి. వస్తువులపై పూర్తి వివరాలు ప్రింట్ చేసి ఉండాలి. నిబంధనలు మీరిన వ్యాపారులపై చర్యలు ఉంటాయి.

ఖమ్మం జిల్లాలో వర్షం

» పలు చోట్ల రోడ్లు జలమయం » పత్తి పంటకు పాక్షికనష్టం

ఖమ్మం కలెక్టరేట్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఖమ్మం జిల్లాలో శుక్రవారం ముసురు వర్షం పడింది. అల్పపీడనం ప్రభావంతో ఏపీలో భారీ వర్షాలు కురుస్తుండగా.. ఆ ప్రభావం సరిహద్దున ఉన్న ఖమ్మం జిల్లాలోనూ కొనసాగింది. గురు, శుక్రవారం రెండు రోజుల పాటు విస్తారంగా వర్షం పడగా.. శుక్రవారం ఉదయం వాతావరణం పూర్తిగా మారిపోయింది. చల్లని గాలులు వీస్తున్నాయి. మధ్యాహ్నానికి జిల్లాలో 10మండలాల్లో వర్షం కురిసింది. ఖమ్మం నగరంలోని పలు రహదారుల్లో రోడ్లపైకి నీరు నిలిచింది. ఇక జిల్లాలోని చెరువులు ఇప్పటికే అలుగులు పోస్తుండగా.. ఈ వర్షం కారణంగా పంటలకు ముఖ్యంగా పత్తికి పాక్షికంగా నష్టం వాటిల్లినట్టు రైతులు చెబుతున్నారు. ముందుగా వేసిన పత్తి చేలలో దూది బయటకు వస్తోందని, వర్షాల కారణంగా ఆ దూది లో నీళ్ల చేరి రంగుమారి కుళ్లిపోతోందని వాపోతున్నారు. అత్యధికంగా ఖమ్మం రూరల్ మండలంలో 4.5మిల్లీ మీటర్ల వర్షం పడగా.. కామేపల్లిలో 3.5, ఖమ్మం అర్బన్‌లో 2.9, రఘునాథపాలెంలో 2.3, తిరుమలాయపాలెంలో 1.8, సింగరేణి, కూసుమంచిలో ఒక మిల్లీమీటరు చొప్పున వర్షం పడింది. మిగిలిన మండలాల్లోనూ జల్లులు పడ్డాయి. ఈ క్రమంలో జిల్లాలో 18.4 మిల్లీ మీటర్ల సగటు వర్షం పాతం నమోదైంది.

పాఠాలు చెప్పనీయండి మహాప్రభో..

(5వ పేజీ తరువాయి)

పాఠ్య పుస్తకాల పంపిణీ, తల్లిదండ్రుల సమావేశాలు, కాంప్లెక్స్ సమావేశాలు, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ శిక్షణ వంటి అదనపు పనుల భారం వల్ల విద్యార్థులకు సక్రమంగా విద్యను అందించలేకపోతున్నామని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇది చాలదన్నట్టు 100 శాతం ఉత్తీర్ణత, విద్యార్థుల హాజరు 80 నుంచి 100శాతం వరకు, గుణాత్మక నాణ్యమైన విద్యను అందించాలని అధికారులు ఆదేశాలు జారీ చేయడం వల్ల విద్య ముందుకు సాగడం లేదని చెబుతున్నారు. పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు ముందు ఒత్తిడి పెంచడం వల్ల అటు విద్యార్థులతో పాటు ఇటు ఉపాధ్యాయులూ ఆందోళనకు గురవుతున్నారు. విద్యాశాఖ వార్షిక ప్రణాళికకు, అమలు చేసేదానికి ఏ మాత్రం పొంతన లేదని.. ఇది తమకు తలనొప్పిగా మారిందని ఉపాధ్యాయులకు ఒక తల నొప్పిగా తయారయిందని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా విద్యాబోధనకి తమకు ఎక్కువ సమయం కేటాయించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

గిరిజన సంక్షేమ శాఖ జేడీగా మణెమ్మ?


డీడీ మణెమ్మ

భద్రాచలం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : భద్రాచలం ఐటీడీఏలో గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకురాలిగా పని చేస్తున్న మణెమ్మకు గిరిజన సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ (జేడీ)గా ఉద్యోగోన్నతి లభించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఈ మేరకు అధికారిక ఉత్తర్వులు వెలువడాల్సి ఉన్నట్లు గిరిజన సంక్షేమ శాఖ వర్గాల ద్వారా సమాచారం. ఇదిలా ఉండగా మణెమ్మ ఈ నెల 30న ఉద్యోగ విరమణ చేయనున్నారు.

డీపీవోగా ఎంపికైన అనూష



ఖమ్మంఖానాపురంహవేలి, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరం మామిళ్లగూడేనికి చెందిన బొప్పన చంద్రశేఖర్‌రావు, పద్మావతి దంపతుల కుమార్తె అనూష టీఎస్‌పీఎస్సీ ప్రకటించిన గ్రూప్-1 ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 112, మల్టీజోన్‌లో 62వ ర్యాంక్ సాధించి డీపీవోగా ఎంపికైంది. ఖమ్మంలో ఎస్‌బీఐటీ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్‌లో కంప్యూటర్ సైన్స్ పూర్తి చేసి, ఉస్మానియా యునివర్సిటీలోఎ ఎల్ఎల్‌బీ పూర్తిచేసి రెండు గోల్డ్ మెడల్స్ సాధించింది. తొలి ప్రయత్నంలోనే గ్రూప్ వన్‌లో డీపీవోగా ఎంపికకావడం సంతోషంగా ఉందన్నారు. భర్త సంతోష్, తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే గ్రూప్-1కు సిద్ధమై మొదటి ప్రయత్నంలోనే విజయం సాధించానన్నారు. కాగా అనూషను పలువురు అభినందించారు.

నలుగురు మావోయిస్టుల అరెస్టు

» వారిలో ఇద్దరిపై రూ.9లక్షల రివార్డు

చర్ల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా అడవుల్లోని వేరు వేరు ప్రాంతాల నుంచి శుక్రవారం నలుగురు మావోయిస్టులను కేంద్ర బలగాలు అరెస్టు చేశాయి. వీరిలో ఇద్దరిపై సుమారు రూ.9లక్షల రివార్డు ఉన్నట్లు పేర్కొన్నాయి, మావోయిస్టుల కదలికల నేపథ్యంలో బలగాలు బీజాపూర్ అడవుల్లో కూబింగ్ నిర్వహిస్తున్నాయి. ఇదే క్రమంలో పోలంపల్లి అడవుల్లో జేగొరు కొండ ఏరియా కమిటీ డివిజన్ కమిటీ సభ్యుడు కుంజం మల్లేష్ పటుబడ్డాడు. అతడిపై రూ.8లక్షల రివార్డు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. పామేడు, తెర్రం, ఆవపల్లి స్టేషన్లలో అతడిపై పలు కేసులున్నాయి. అలాగే డార్మర్ గ్రామానికి చెందిన జనతన సార్కార్ సభ్యుడు అనిల్‌ను కూడా అరెస్టు చేశారు. ఇతనిపై రూ.లక్ష రివార్డున్నట్లు పోలీసులు తెలిపారు. అలాగే పామేడు పోలీస్ స్టేషన్ అడవుల్లో శుక్రవారం ఇద్దరు మావోయిస్టులను బలగాలు అరెస్టు చేశాయి. వారి వద్ద నుంచి తుపాకులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం రాయపూర్‌లో శుక్రవారం జగ్గు, కమల అనే మావోయిస్టు జంటను బలగాలు అదుపులోకి తీసుకున్నాయి. వారి వద్ద నుంచి బంగారాన్ని బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. వీరు కొంత కాలంగా బియ్యం, వైద్యం, ఇతర వస్తువులు మావోయిస్టులకు చేరవేస్తున్నారని పోలీసులు చెబుతున్నారు. వీరిది బీజాపూర్ జిల్లా గంగలూరు గ్రామం కాగా వీరిని పోలీసులు కోర్టులో హాజరుపరిచారు.

కవిని అజరామరంగా నిలిపేది ఉత్తమ కవిత్వం

భద్రాచలం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): భావనాప్రియ ఎనిమిదో సాహితి ఉత్సవాలలో రెండో రోజు కార్యక్రమాల్లో శతావధాన విద్వన్మరాళ ఆముదాల మురళీ చక్రవర్తి నా భావసుందరి కావ్యంపై డా.సుంకర గోపాల్, చక్రవర్తి లయాత్మక కవిత గురించి వివరించారు. డా. జి.వి. పూర్ణచందర్ చక్రవర్తి బతుకు చిత్రాలపై, చక్రవర్తి చిట్టి కవితల విశేషాలను వివరించారు. సాయంత్రం చక్రవర్తికి భావనాప్రియ సభ్యులు ఘన సత్కారం నిర్వహించారు


చక్రవర్తిని సన్మానిస్తున్న దృశ్యం

షీ టీం అవగాహన

చుంచుపల్లి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గత వారం రోజులుగా పెనుబల్లిలో కొనసాగుతున్న నేషనల్ సర్వీస్ స్కీం (ఎన్ఎస్ఎస్) శీతాకాల శిబిరంలో వాలంటరీస్‌గా విధులు నిర్వహిస్తున్న విద్యార్థులకు షీ టీం ఎస్ఐ రమాదేవి, కొత్తగూడెం టూటౌన్ ఎస్ఐ మనీషాలు శుక్రవారం అవగాహన కల్పించారు. డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలు, పోక్సో చట్టంపై, మహిళలపై జరిగే నేరాలపై, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. షీ టీంకు ఏదైనా ఫిర్యాదు ఇవ్వాలనుకుంటే కొత్తగూడెం ఫోన్ 8712682131కు సమాచారం అందించాలన్నారు. ఎమర్జెన్సీ సమయంలో 100కు ఫోన్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సింగరేణి మహిళ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు ఆశాజ్యోతి, సునీత, రాజేశ్వరీ, షీ టీమ్ ఏఎస్ఐ నాగయ్య, వాలంటరీస్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే కఠినచర్యలు

ఇల్లెందుటౌన్ 25 (ఆంధ్రజ్యోతి): పట్టణం పరిసర ప్రాంతాల్లో ఉన్న బెల్ట్‌షాపులు నిబంధనలు పాటించకుండా వ్యవహరిస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఇల్లెందు సీఐ తాటిపాముల సురేస్ హెచ్చారించారు. శుక్రవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో బెల్ట్ షాపుల నిర్వహకులకు పలు సూచనలు చేశారు. రాత్రి పదిగంటల తరువాత బెల్ట్ షాపులను మూసివేయాలని సీఐ చెప్పారు.

వీర వనిత చాకలి ఐలమ్మ స్ఫూర్తిదాయకం

» కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ఖమ్మం ఖానాపురంహవేలి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వీర వనిత చాకలి ఐలమ్మ ప్రదర్శించిన పోరాటం స్ఫూర్తిదాయకమని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని వైరా రోడ్డులోని ప్రభుత్వ వైద్య కళాశాల ఎదురుగా ఉన్న చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద 130వ జయంతి కార్యక్రమంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పాల్గొని ఆమె విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సమాజంలోని అసమానత్వానికి ఎదురొడ్డి నిర్భయంగా పోరాటం చేసిన వీరనారి చాకలి ఐలమ్మ అని, జమీందార్ల పాలనలో వెట్టిచాకిరికి వ్యతిరేకంగా అనేక సంఘాల్లో ఆమె స్ఫూర్తి నింపారని అన్నారు. చాకలి ఐలమ్మ సంఘ సేవకురాలిగా, భూ, సాయుధ రైతాంగ పోరాటంలో ప్రదర్శించిన పోరాట పటిమతో వీర వనితగా చరిత్రలో నిలిచి, ప్రతి ఒక్కరికి స్ఫూర్తిగా నిలిచారన్నారు. వారి త్యాగాలు, గొప్పతనం ప్రజలకు తెలిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఐలమ్మ జయంతిని అధికారికంగా నిర్వహిస్తోందన్నారు. చాకలి ఐలమ్మకు గుర్తింపు అందించడంలో భాగంగా కోఠిలోని మహిళా యూనివర్సిటీకి ప్రభుత్వం చాకలి ఐలమ్మ పేరు పెట్టిందన్నారు. జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి జి.జ్యోతి, 43వ డివిజన్ కార్పొరేటర్ క్లైమెంట్, రజక కుల సంఘ నాయకులు, బీసీ కుల సంఘ నాయకులు బొడ్డు ఉపేందర్, జక్కుల వెంకటరమణ, కణతాల నరసింహారావు, తుపాకుల ఎర్రగొండ స్వామి, గజ్జెళ్ల వెంకన్న, పడిగల కృష్ణవేణి, కృష్ణారావు, రేగళ్ల సీతారాములు, సత్తెనపల్లి శ్రీను, అన్నారపు వెంకటేశ్వర్లు, బానోటి హనుమంతరావు, మాచర్ల వేలాద్రి, మేకల సుగుణరావు, అమరగాని వెంకటేశ్వర్లు, కూరాకుల నాగభూషణం, సహాయ వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారులు, వసతిగృహ సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.



చిన్నారుల కూచిపూడి నృత్య ప్రదర్శన

ధనలక్ష్మి అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారు

● ఆకట్టుకున్న సీతారాముల కల్యాణ నృత్య రూపకం



హోమం నిర్వహిస్తున్న దృశ్యం

భద్రాచలం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయ ప్రాంగణంలో గల శ్రీ లక్ష్మీ తాయారు ఆలయంలో అమ్మవారు ధనలక్ష్మి అలంకారంలో శుక్రవారం భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత లక్ష్మీతాయారు మూలవరులకు పంచామృతాలతో ప్రత్యేక స్నపనం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ధనలక్ష్మి అలంకారం ధరింపజేసి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి ఈ సమయంలో సామూహిక కుంకుమార్చన, విష్ణు సహస్ర నామ పారాయణం నిర్వహిం చారు. అనంతరం అధిక సంఖ్యలో భక్తులు ధనలక్ష్మి అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. కాగా.. శనివారం ధాన్యలక్ష్మి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. అలాగే చిత్రకూట మండపంలో సామూహి క శ్రీరామాయణ మహాపారాయణం, సంక్షేప రామాయణ హోమం నిర్వహి ంచారు. అలాగే మైత్రి ఫైన్ ఆర్ట్స్ మద్రాసు ఆధ్వర్యంలో సీతారాముల కల్యా ణ నృత్య రూపకం నృత్య ప్రదర్శన నిర్వహించారు.

సింగరేణి కార్మికులకు

దీపావళి బోనస్ రూ.లక్షా 3 వేలు

కోల్‌కతాలో జరిగిన కార్మిక సంఘాల సమావేశంలో

కోల్ ఇండియా యాజమాన్యం ప్రకటన

కొత్తగూడెం టౌన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : బొగ్గుగని కార్మికులకు పెర్ఫామెన్స్ రిలేటెడ్ (పీఎల్‌ఆర్) బోనస్‌గా రూ.లక్ష3వేలను చెల్లించేలా కోల్‌ఇండియా యాజమాన్యం నిర్ణయించింది. గురు, శుక్రవారాల్లో కోల్‌కతాలో జరిగిన జాతీయ కార్మిక సంఘాలతో కోల్ ఇండియా యాజమాన్యం సుదీర్ఘ చర్చలు జరిపింది. కార్మిక సంఘాలు కోల్ ఇండియా యాజమాన్యం రూ.లక్ష3వేలు చెల్లించేలా నిర్ణయించినట్టు కార్మిక సంఘాల నాయకులు జనక్ ప్రసాద్, రాజ్‌కుమార్ తెలిపారు. గతేడాది పీఎల్‌ఆర్ బోనస్‌ను కోల్‌ఇండియా యాజమాన్యం రూ.93,700 చెల్లించగా, ఈ ఏడాది రూ.1,03,000 చెల్లించేందుకు అంగీకరించడం పట్ల కార్మికులు హర్షం ప్రకటించారు. ప్రకటించిన పీఎల్‌ఆర్ బోనస్‌ను దీపావళి పండుగకు ముందు చెల్లించనున్నారు.



గువ్వలగూడెంలో నిర్మాణంలో ఉన్న టీడీపీ కార్యాలయం

టీడీపీ కార్యాలయం కబ్జా.. ఒకరి అరెస్టు

నేలకొండపల్లి,సెప్టెంబరు26(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని గువ్వలగూడెం గ్రామంలో గల తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని కబ్జా చేశారంటూ అందిన ఫిర్యాదు మేరకు నేలకొండపల్లి పోలీసులు అదే గ్రామానికి చెందిన రావెళ్ల జానకిరామయ్య అనే వ్యక్తిని గురువారం సాయంత్రం అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళితే.. గువ్వలగూడెం గ్రామంలో తెలుగుదేశం కార్యాలయాన్ని నిర్మించేందుకు కార్యకర్తలు అదే గ్రామానికి చెందిన వంగూరి వీరాస్వామి వద్ద నుంచి స్థలాన్ని కొనుగోలు చేసి వేముల వెంకట నర్సయ్య, ముప్పాళ్ళ వెంకటేశ్వర్లు పేరు మీద అగ్రిమెంట్ చేయించారు. 2010, నవంబరు 21న అప్పటి ఖమ్మం ఎంపీగా ఉన్న నామా నాగేశ్వరరావు పార్టీ కార్యాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నిధుల కొరతతో నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయింది. కార్యకర్తలందరి సమక్షంలో కార్యాలయానికి సంబంధించిన ఒప్పంద కాగితాలను రావెళ్ళ జానకి రామయ్య వద్ద దాచిపెట్టారు. అనంతరం జరిగిన రాజకీయ పరిణామాల్లో జానకి రామయ్య టీడీపీని వదిలి బీఆర్‌ఎస్‌లోకి వెళ్లాడు. 2022లో పార్టీ కార్యాలయ నిర్మాణాన్ని ప్రారంభించడానికి ప్రయత్నాలు చేస్తుండగా.. స్థలం నాదంటూ జానకిరామయ్య నిర్మాణానికి అడ్డు తగిలాడు. అలాగే స్థలం కాగితాలు జానకిరామయ్య వద్దే ఉండడంతో.. గ్రామ పంచాయతీలో స్థలాన్ని తన పేరు మీదకు మార్చుకున్నాడు. విషయాన్ని గమనించిన కార్యకర్తలు పార్టీ కార్యాలయం వద్దకు వెళ్లగా.. వాళ్లకు అడ్డు తగిలాడు. దీంతో తమకు న్యాయం చేయాలంటూ వేముల వెంకటనర్సయ్య మే,6న నేలకొండపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదుపై విచారణ జరిపిన నేలకొండపల్లి పోలీసులు 420, 467, 468, 471 సెక్షన్ల కింద కేసును నమోదు చేశారు. గురువారం జానకిరామయ్యను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

నకిలీ బంగారంతో మోసగిస్తున్న వారి ఫొటోలు విడుదల





అపరిచిత మహిళ, వ్యక్తి


ఖమ్మంక్రైం, సెప్టెంబరు26(ఆంధ్రజ్యోతి): నగరంలో తిరుగుతూ బంగారు బిస్కెట్లు తక్కువ ధరకు ఇస్తామంటూ నమ్మబలుకుతున్న ఓ మహిళతో పాటు ఓ వ్యక్తి ఫొటోలను శుక్రవారం త్రీటౌన్ సీఐ మోహన్‌బాబు విడుదల చేశారు. ఓ అపరిచిత మహిళ ముందు వెళుతూ ఆమె చేతిలోని ప్యాకెట్‌ను జారవిడిచి బంగారం దొరికిందంటూ నమ్మబలికిస్తూ ఇటీవల మోసం చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. విడుదల చేసిన ఫొటోల ప్రకారం నిందితులు కనిపిస్తే 8712659115 నెంబర్‌కు లేదా డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం అందించాలని సీఐ ప్రకటనలో కోరారు. ఇలాంటి వారి మోసాల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



ఖానాపురం హవేలి ప్రశాంత్ నగర్‌లో..



రాపర్తినగర్‌లో..



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

అత్యంత వైభవంగా

శరన్నవరాత్రి వేడుకలు

▸▸ కరెన్సీతో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ

ఖమ్మంఖానాపురంహవేలి,సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో దేవీ శరన్నవరాత్రి వేడుకలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. దేవీ నవరాత్రుల వేడుకలలో భాగంగా నాల్గోవ రోజు శుక్రవారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. నగరంలో ని స్థంభాద్రి లక్ష్మీ నరసింహస్వామి భక్త బృందం ఆధ్వర్యంలో 21వ వార్షిక శరన్నవరాత్రుల వేడుకలను జమ్మిబండ వద్ద నిర్వహిస్తున్నారు. అమ్మవారు మహాలక్ష్మీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం గణపతి పూజ, గోపూజ, కుంకుమార్చనతో అమ్మవారికి పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని రూ. 10లక్షల కరెన్సీ నోట్లతో ప్రత్యేకంగా అలంకరించారు. స్థంభాద్రి లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక అలంకరణ మధ్య ధనలక్ష్మీ అమ్మవారుగా భక్తులకు దర్శనమిచ్చారు. రాపర్తినగర్‌లో మట్టితో తయారు చేసిన దుర్గాదేవిని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. నగరంలోని ఇందిరానగర్ పర్ణశాల రామాలయంలో, రోటరీ నగర్ రాజ రాజేశ్వరి అమ్మవారి ఆలయంలో, ఎస్ఎస్‌పి రోడ్ దుర్గామాత ఆలయంలో, మామిళ్లగుడెం, గాంధీచౌక్, ప్రశాంతినగర్, ఖైకొండాయిగుడెం, జయనగర్ కాలనీ, బల్లేపల్లి, తదితర ప్రాంతాలలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి క్షీరాన్నం, బెల్లమన్నం, పాయిసం, పులిహోర తదితర ప్రత్యేక నైవేద్యాలు చేసి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. సాయంత్రం అమ్మవారి మండపాల వద్ద మహిళలు బతుకమ్మ వేడుకలు నిర్వహించి, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.



జమ్మిబండ వద్ద అమ్మవారిని రూ. 10లక్షలతో అలంకరించిన దృశ్యం

37 రోజులుగా.. 35 అడుగులు..

▸▸ భద్రాచలం వద్ద గోదావరి ప్రవాహ తీరిది

▸▸ మూడున్నర దశాబ్దాల క్రితం ఇదే రీతిలో ప్రవాహం వచ్చిందంటున్న స్థానికులు

భద్రాచలం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : గోదావరి నదీ పరివాహక ప్రాంతవాసులకు వానాకాలం వచ్చిందంటే కంటిమీద కునుకు ఉండదు. జూలై, ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో గోదావరి ఉధృతం నుంచి.. ఉగ్రరూపం దాల్చి.. మహోగ్రంగా ప్రవహించిన సందర్భాలు ఎన్నో ప్రజల కళ్ల ముందు కదలాడుతుంటాయి. కానీ తొలిసారిగా ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో సుమారు 37 రోజుల పాటు భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 35అడుగులు.. ఆపైన పలుమార్లు ప్రవహించడం గమనించదగ్గ విషయం. భద్రాచలం వద్ద గోదావరి కరకట్ట నిర్మాణం చేపట్టక ముందు 1990లో ఇదే రీతిన గోదావరి ఆందోళనకు గురి చేసిందని స్థానికులు పేర్కొంటున్నారు. గత 24గంటల్లో భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 37అడుగుల నుంచి 44.7 అడుగులకు చేరుకోవడంతో గోదావరి వరదల తీరుపై అవగాహన ఉన్న స్థానికులు గత విషయాన్ని గుర్తు చేసుకుంటున్నారు. ఇదిలా ఉండగా గోదావరి ఈసారి ఊహించని రీతిలో పెరుగుతూ తగ్గుతూ నిలకడగా మళ్లీ పెరుగుతూ తరచూ వస్తుండటంతో గోదావరి నదీ పరివాహక ప్రాంతంలోని రైతులు పంటలు వేయని పరిస్థితి ఉంది. సామాజిక మాధ్యమాలు, మీడియా ద్వారా గోదావరి పెరుగుతోందన్న విషయం తెలిసిన వెంటనే పోలవరం ముంపు మండలాల్లోని ప్రజల ఆందోళన అంత ఇంత కాదు. ఏ క్షణాన తాము ఖాళీ చేయాల్సి వస్తోందో తమ పరిస్థితి ఏమిటో అర్థం కాక ఎప్పటికప్పుడు భద్రాచలంలో సీడబ్ల్యూసీ, కంట్రోల్ రూంలతో పాటు మీడియా ప్రతినిధుల నుంచి ఎప్పటికప్పుడు సమాచారం సేకరిస్తున్నారు. ఇదిలా ఉండగా నదీ పరివాహక ప్రాంతంలోని ఉప నదుల పరిసర ప్రాంతాల్లో తరచూ ఊహించని రీతిలో భారీ వర్షాలు కురుస్తుండటంతో ఆ ప్రభావం ప్రధాన నదైన గోదావరిపై స్పష్టంగా పడుతోందని దీంతో భద్రాచలం వద్ద గతంలో ఎన్నడూ లేనటువంటి రీతిలో వేగంగా నీటిమట్టం పెరుగుతోందని నీటిపారుదల శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి.



భద్రాచలం వద్ద గోదావరి



44.7 అడుగుల వద్ద గోదావరి

37 రోజుల్లో గోదావరి ఇలా..

- ఆగస్టు 18న 38అడుగులు వచ్చింది.
- 19న మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయి 43అడుగుల చేరిక
- 21న 51.9అడుగులు నమోదై 5గంటల పాటు నిలకడగా ఉంది.
- ఆగస్టు 28న 12 గంటల్లో 10అడుగుల నీటిమట్టం పెరిగి 37.1అడుగులకు చేరింది.
- ఆగస్టు 30న 47.5 అడుగుల వద్ద 9 గంటల పాటు నిలకడగా ఉంది.
- ఆగస్టు 31న 48 అడుగులకు రావడంతో రెండో ప్రమాద హెచ్చరిక జారీ
- సెప్టెంబరు 3న మళ్లీ మొదటి ప్రమాద హెచ్చరిక జారీ
- సెప్టెంబరు 5న 39.9అడుగులు,
- సెప్టెంబరు 26న 44.7 అడుగులు



వెంకట్రావుకు డాక్టరేట్

సత్తుపల్లిరూరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో మండలంలోని కిష్టాపురం గ్రామానికి చెందిన ఆరేపల్లి సర్వేశ్వరరావు, వెంకట్రావమ్మ దంపతుల కుమారుడు వెంకట్రావుకు శుక్రవారం ప్రతిష్ఠాత్మక గౌరవ డాక్టరేట్ లభించింది. ఈ డాక్టరేట్‌ను హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయం ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగంలో చేసిన పరిశోధనకు గాను పరీక్షల నియంత్రణ అధికారి ప్రకటించినట్లు వెంకట్రావ్ తెలిపారు. హైదరాబాద్‌లోని సీబీఐటీ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ప్రొఫెసర్ జి.సురేష్‌బాబు, ఓయూ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ప్రొఫెసర్ పి.సతీష్‌కుమార్‌ల పర్యవేక్షణలో కంట్రోల్ అండ్ ఎనాలసిస్ ఆఫ్ ఐలాండెడ్ మైక్రో గ్రిడ్ సిస్టం టూ అన్ బ్యాలెన్స్‌డ్ అండ్ నాన్ లీనియర్ లోడ్ అనే అంశంపై చేసిన పరిశోధనకు ఆయనకు ఈ డాక్టరేట్ వరించింది. గ్రామీణ స్థాయి నుంచి పీహెచ్‌డీ డిగ్రీ సాధించిన వెంకట్రావ్‌ను పలువురు అభినందించారు.

బోధకులు, ఆయా పోస్టుల ఇంటర్వ్యూకు విశేష స్పందన



సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ఇంటర్వ్యూకు తరలొచ్చిన మహిళా అభ్యర్థులు



ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న అధికారులు

▸▸ పసిపిల్లలతో తరలొచ్చిన మహిళా అభ్యర్థులు

▸▸ సబ్ కలెక్టర్ పర్యవేక్షణలో ఇంటర్వ్యూ

కల్లూరు, సెప్టెంబరు26 (ఆంధ్రజ్యోతి) : విద్యాశాఖ తరఫున కల్లూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన బోధకులు, ఆయా పోస్టుల ఇంటర్వ్యూకు విశేష స్పందన వచ్చింది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత ప్రాథమిక విద్యను అందించే క్రమంలో బోధకులు, ఆయా పోస్టులను కేటాయించింది. ఇందులో భాగంగా కల్లూరు డివిజన్ పరిధిలో మొత్తం 8 మంది బోధకులు, మరో 8 మంది ఆయాల పోస్టులు ఉండగా.. వాటికి సబ్‌కలెక్టర్ అజయ్‌యాదవ్ పర్యవేక్షణలో తహసీల్దార్లు, ఎంఈఓలతో ఇంటర్వ్యూ నిర్వహించారు. ఇలా తల్లాడ మండలంలోని వెంకట్రామునితండ, ముద్దునూరు, పెనుబల్లి మండలంలో మండాలపాడు, సూరయ్యబంజర, రాంచంద్రరావుబంజర, ఏన్కూరు మండలంలో టీఎల్‌పేట, హిమంనగర్, సత్తుపల్లి మండలంలో చెరుకుపల్లి ప్రభుత్వ పాఠశాలల్లో పై విధంగా ఆయా పోస్టులకు ఇంటర్వ్యూ నిర్వహించగా.. సుమారు 200మందికి పైగా మహిళా అభ్యర్థులు హాజరైనట్లు సమాచారం. ఇలా ఒక్క బోధకుని పోస్టుకు గాను ఏ స్థాయిలో అభ్యర్థులు దరఖాస్తులు చేశారో అంచనా వేయొచ్చు. ఉదయం 10 గంటలకు సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఇంటర్వ్యూ ప్రారంభం కాగా.. అంతకు ముందే మహిళా అభ్యర్థినులు కల్లూరు డివిజన్ పరిధిలో గల ఐదు మండలాల నుంచి భారీగా తరలొచ్చారు. సాయంత్రం 6 గంటల వరకు ఇంటర్వ్యూలు సాగాయి. తమ పసి పిల్లలను కూడా అభ్యర్థులు వెంట తీసుకొని వచ్చి గంటల తరబడి పడిగాపులు పడ్డారు. ఎంఈడి, బీఈడి చదివిన వారు కూడా ఇంటర్వ్యూకు వచ్చారు. ఆయా పోస్టుకు అర్హత 7 వతరగతి, బోధకుడి పోస్టుకు ఇంటర్మీడియట్ కాగా.. ఉన్నత విద్యావంతులు కూడా హాజరు కావడం విశేషం. ఈ కార్యక్రమంలో పెనుబల్లి, తల్లాడ, ఏన్కూరు తహసీల్దార్లు శ్రీనివాసరావు, కరుణాకర్‌రెడ్డి, శేషగిరిరావు, ఉపేందర్‌తో పాటు ఆయా మండలాల విద్యాశాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



భూమిని పరిశీలిస్తున్న 'సీతారామ' ఏఈఈ గోపాల్‌రెడ్డి

డిస్ట్రిబ్యూటరీ కాలువల నిర్మాణానికి భూసేకరణ : ఏఈఈ

జూలూరుపాడు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): సీతారామ డిస్ట్రిబ్యూటరీ కాలువల నిర్మాణానికి కావాల్సిన భూసేకరణకు సర్వే నిర్వహిస్తున్నట్లు సీతారామ డిస్ట్రిబ్యూటరీ ప్యాకేజీ-2 ఏఈఈ ఏ.గోపాలరెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని గుండెపుడి గ్రామంలో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్యాకేజీ -2 కింద జూలూరుపాడు మండలంలోని గుండెపుడి, కాకర్ల, మాచినేనిపేట, చంద్రుగొండ మండలం గానుగపాడు, సుజాతనగర్ మండలం రాఘవాపురం గ్రామాల పరిధిలో డిస్ట్రిబ్యూటరీ కాలువల నిర్మాణానికి 200ఎకరాల భూమిని, 12కిలోమీటర్ల పొడవునా సర్వే చేపట్టాల్సి ఉందన్నారు. ఇందులో భాగంగా నెలరోజుల్లో సర్వేను పూర్తిచేసి జిల్లా కలెక్టర్‌కు నివేదికను అందజేస్తామని తెలిపారు. భూములు కోల్పోయిన రైతులకు అందించే పరిహార వివరాలను కలెక్టర్ ప్రకటిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ కొమ్మినేని పాండురంగారావు, సిబ్బంది, రైతులు కృష్ణమూర్తి, ప్రవీణ్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

రైతులు, డ్రైవర్లకు సముచిత స్థానం కోసం

మహారాష్ట్ర యువకుడి సైకిల్ యాత్ర



జూలూరుపాడు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): సమాజంలో రైతులకు, వాహన డ్రైవర్లకు రోజు రోజుకూ విలువ తగ్గిపోతోందని.. అందు వల్ల వారికి కేంద్ర, రాష్ట్ర రాష్ట్ర ప్రభుత్వాలు సముచిత స్థానం కల్పించాలని కోరుతూ మహారాష్ట్రకు చెందిన అబ్దుల్ సలీం షేక్ అనే యువకుడు సైకిల్ యాత్ర చేపట్టాడు. శుక్రవారం యువకుడు జూలూరుపాడుకు రాగా.. ఆయన యాత్రకు స్థానికులు స్వాగతం పలికారు. అనంతరం అబ్దుల్ సలీం షేక్ మాట్లాడుతూ.. రైతులు ఎన్నో వ్యయ ప్రయాసాలకోర్చి పంటలు పండించినప్పటికీ.. గిట్టుబాటు ధర లేకపోవడంతో పాటు గౌరవం కూడా దక్కడం లేదని తెలిపారు. వాహన డ్రైవర్ల పరిస్థితి కూడా సరిగ్గా ఇలానే ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారికి సముచిత స్థానం కల్పించడంతో పాటు 60సంవత్సరాలు దాటిన వారికి పింఛన్ సౌకర్యాన్ని వర్తింపచేయాలని, ఆర్థిక చేయూతను అందించాలని కోరారు. ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని కోరారు. ఇప్పటికే సైకిల్‌యాత్ర ద్వారా తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని పలు ప్రాంతాలను సందర్శించి తన యాత్ర గురించి ప్రజలకు తెలియజేసినట్లు తెలిపారు. అలాగే ఛత్తీస్‌గఢ్, ఒడిస్సా, మధ్యప్రదేశ్ రాష్ట్రాలలో కూడా యాత్ర చేపడతానని తెలిపారు. ఆగస్టు నెలలో మహారాష్ట్ర నుంచి తన యాత్రను ప్రారంభిస్తానని అబ్దుల్ సలీం షేక్ వివరించారు.



పట్టుబడిన నిందితుడితో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

నల్లబెల్లం తరలిస్తున్న వాహనం పట్టివేత

● ఆంధ్రాకు చెందిన ముగ్గురిపై కేసు

అశ్వారావుపేట రూరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా తరలుతున్న నల్ల బెల్లాన్ని ఖమ్మం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం అశ్వారావుపేటలో పట్టుకున్నారు. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్సై శ్రీహరి తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రాలోని తణుకు నుంచి భద్రాద్రి జిల్లాలోని కొత్తగూడెంకు వాహనంలో 4104 కిలోల నల్లబెల్లం, 30కిలోల పటిక, 10లీటర్ల నాటుసారాను తరలిస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అశ్వారావుపేటలోని అంతర్‌రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద ఖమ్మం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్సై శ్రీహరి ఆధ్వర్యంలో సిబ్బంది శుక్రవారం తెల్లవారుజామున వాహనాల తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో ప్రత్యేకంగా బాక్స్‌ల్లో పెట్టి అక్రమంగా బెల్లం రవాణా చేస్తున్న వాహనం పట్టుబడింది. దీంతో వాహనాన్ని, బెల్లంను, పటికతో పాటు రెండు సెల్‌ఫోన్లను సీజ్ చేసి స్థానిక అబ్కారీ కార్యాలయానికి తరలించారు. బెల్లాన్ని తరలిస్తున్న తూర్పు గోదావరికి చెందిన కొడమంచిలి క్రాంతి, సవకపు రవి, పులిదండి హరీశ్‌పై కేసు నమోదు చేశారు. కొడమంచిలి క్రాంతి, రవిని అదుపులోకి తీసుకోగా.. హరీశ్ పరారీలో ఉన్నాడు. ఈ తనిఖీల్లో హెడ్‌కానిస్టేబుల్ కరీం, కానిస్టేబుల్స్ సుధీర్, వెంకట్, ఉపేందర్‌లు పాల్గొన్నారు.

హత్య కేసులో నలుగురి రిమాండ్

మధిర రూరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మధిర మున్సిపాలిటీ పరిధిలోని జిలుగుమాడు గ్రామంలో ఈనెల 8వతేదీన బాలసాని మురళీ అనే వ్యక్తిని హత్య చేసిన కేసులో శుక్రవారం నలుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు మధిర టౌన్ సీఐ రమేష్ తెలిపారు. జిలుగుమాడులో బాలసాని మురళీ అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు కుటుంబసభ్యులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. ఈ కేసును సీఐ రమేష్ దర్యాప్తు చేసి హత్య కేసుగా తేల్చారు. దుగ్గిరాల కార్తీక్, బొజ్జగాని వెంకటేశ్వర్లు అలియాస్ పొట్టోడు, బాలసాని మాధవి అలియాస్ ముత్తమ్మ(మృతుడి భార్య), మానుపురి గోపాలరావు అలియాస్ రాజు అలియాస్ మేడ గోపి అలియాస్ మేడా గోపాలరావు అనే వ్యక్తులు కలిసి పథకం ప్రకారం హత్య చేసినట్లు తెలిపారు. ఆ నలుగురిని అరెస్టు చేసి కోర్టు రిమాండ్‌కు తరలించామని సీఐ రమేష్ తెలిపారు.

రూ.22వేలు కాజేసిన సైబర్ నేరగాడు

పెనుబల్లి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రతిరోజూ పోలీసు, బ్యాంకు ఇతర శాఖల అధికారులు బ్యాంకు ఖాతాదారులను అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నా.. కొందరు మోసపోతూనే ఉన్నారు. ఇలాంటి ఘటన మరోసారి శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పెనుబల్లి మండలం తాళ్లపెంట గ్రామానికి చెందిన సుబ్బారావు వీఎంబంజర్‌లో వ్యాపారం చేస్తుంటాడు. గత ఏడాది డిసెంబరు 31న ఉదయం 10గంటల సమయంలో ఎస్‌బీఐ కస్టమర్ కేర్ నుంచి మాట్లాడుతున్నామని, ఈ క్రెడిట్ కార్డు లిమిట్ పెరిగిందని ఓటీపీ చెపితే అప్‌డేట్ చేస్తామని ఫోన్ చేశాడు. దీంతో సుబ్బారావు తనకు వచ్చిన ఓటీపీ నెంబర్‌ను వాళ్లకు చెప్పాడు. ఐదునిమిషాల్లోని ఆయన ఖాతా నుంచి రూ.22వేలు కట్ అయినట్లు మెసేజ్ వచ్చింది. వెంటనే విచారించగా తనకు సంబంధం లేని వారికి రూ.22వేలు వెళ్లినట్లు గ్రహించి.. సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై వీఎంబంజర్ ఏఎస్సై సత్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఆంధ్రజ్యోతి KHAMMAM CITY

శనివారం 27 సెప్టెంబరు 2025

• ఖమ్మం • రఘునాథపాలెం
• ఖమ్మం రూరల్
• తిరుమలాయపాలెం
• కూసుమంచి
• నేలకొండపల్లి • కామేపల్లి

ఖమ్మం సిటీ
ZONE 8

బీసీ భవన్ నిర్మాణాన్ని తక్షణం పూర్తి చేయాలి

ఖమ్మం అర్బన్ సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలో అసంపూర్తిగా ఉన్న బీసీ భవన్‌ను సత్వరం పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనుంజయనాయుడు ప్రభుత్వాన్ని కోరారు. ఎన్టీఆర్ సర్కిల్‌లో నిలిచి పోయిన బీసీ భవన్‌ను సంఘం నేతలు శుక్రవారం సందర్శించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం బీసీ భవన్‌కు రూ. 2 కోట్లు మంజూరు చేసి రెండెకరాల స్థలం మంజూరు చేసిందన్నారు. కాగా ప్రస్తుతం నిధులు లేక భవన నిర్మాణం ఆగిపోయిందన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తాటి వెంకటేశ్వరరావు, గాదె లక్ష్మీనారాయణ, నూనె శశిధర్, కనకయ్య, పెనుగర్తి వెంకటరమణాచారి, వీరయ్య, యాకయ్య, మహేంద్ర, వెంకన్న పాల్గొన్నారు.

పూడికతీత ద్వారా ముంపు తగ్గింపు

▸ మేయర్ పునుకొల్లు నీరజ



పూడికతీత పనులు పరిశీలిస్తున్న మేయర్ పునుకొల్లు నీరజ

ఖమ్మం కార్పొరేషన్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ముందస్తు పూడికతీత పనుల ద్వారా డ్రైయినేజీలోని వ్యర్థాలను పూర్తిగా తొలగించడంతో మురుగు, వరద నీరు సజావుగా వెళ్లి పోతుందని ముంపు ప్రభావం ఉండదని మేయర్ పునుకొల్లు నీరజ పేర్కొన్నారు. శుక్రవారం ఖమ్మం నగరంలోని పలు డివిజన్లలో మేయర్ విస్తృతంగా పర్యటించారు. వైరా ఖమ్మం ప్రధాన రహదారి వెంట అండర్ డ్రైయినేజీ పూడిక తీత పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్లాస్టిక్‌కు పూర్తిగా నియంత్రించాలని ఆదేశించారు. గ్యాంగ్ వర్క్‌ను ఇంకా సమర్థవంతంగా చేపట్టాలని సూచించారు. కార్పొరేటర్ బీజే క్లైమెట్, పారిశుధ్య పర్యవేక్షకులు సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

బధిరుల సమస్యలు పరిష్కరిస్తాం



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

ఖమ్మంఖానాపురంహవేలి, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రతి సోమవారము గ్రీవెన్స్ నందు బధిరి భాష తెలిసిన ఒక ట్రైనర్‌ను ఏర్పాటు చేసి వారి సమస్యలు పరిష్కరించుటకు తగు చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం నందు అంతర్జాతీయ బధిరుల దినోత్సవం సందర్భంగా సైగ భాష పోస్టర్‌ను జిల్లా సంక్షేమ అధికారి రామ్‌గోపాల్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ కార్యాలయము గోడమీద బధిరులకు సంబంధించిన సైగ భాష పోస్టర్ పెయింటింగ్ వేయిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా బధిరుల ఉద్యోగులు, నిరుద్యోగ బధిరులు పాల్గొన్నారు.

సేవకు ప్రతిరూపం ఎన్‌ఎస్‌ఎస్



మాట్లాడుతున్న చైతన్యకిషోర్

తిరుమలాయపాలెం, సెప్టెంబరు26(ఆంధ్రజ్యోతి): సేవకు ప్రతిరూపం ఎన్‌ఎస్‌ఎస్ లక్ష్యమని ఆర్ట్‌ఆఫ్ లివింగ్ చెయిన కోఆర్డినేటర్ చైతన్యకిషోర్ తెలిపారు. శుక్రవారం వెదుళ్లచెరువులో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ఏడు రోజుల పాటు నిర్వహించిన శీతాకాల ప్రత్యేక శిబిరం ముగింపు కార్యక్రమంలో మాట్లాడారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, డీపీవో శ్రీనివాసరావు, మీగడ సత్యం, కమతం బాబు, కాంపాటి శ్రీను, సిరసవాడ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఘనంగా అలిగిన బతుకమ్మ వేడుకలు



బతుకమ్మ ఆడుతున్న జడ్పీ సీఈవో దీక్షారైనా

ఖమ్మంఖానాపురంహవేలి, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): బతుకమ్మ సంబురాలలో భాగా శుక్రవారం ఆరవ రోజు జిల్లాలో అలిగిన బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. బతుకమ్మను పేర్చి ఆడుతూ, పాడుతూ తెలంగాణ సంస్కృతి చాటిచెప్పే విధంగా వేడుకలు నిర్వహించారు. నగరంలోని ఇందిరానగర్ పర్ణశాల, రోటరీనగర్ రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో, నగరంలోని పలు ఆలయాలు, అమ్మవారి మండపాల వద్ద బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహిళలు, బాలికలు అధిక సంఖ్యలో హాజరై బతుకమ్మ వేడుకలలో పాల్గొన్నారు.

సీసీ రోడ్లకు శంకుస్థాపన



మాట్లాడుతున్న దయాకర్‌రెడ్డి

నేలకొండపల్లి, సెప్టెంబరు26(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అమ్మగూడెం, నేలకొండపల్లి గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు రెవెన్యూ మంత్రి పొంగులేటిక్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్‌రెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేశారు. అమ్మగూడెం నుంచి కోనాయగూడెం వరకు రూ.4.00 కోట్ల వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డుకు, నేలకొండపల్లిలో రూ.35.00 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాలేరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నట్లు దయాకర్‌రెడ్డి చెప్పారు. కార్యక్రమంలో కొడాలి గోవిందరావు, నెల్లూరి భద్రయ్య, వెన్నపూసల సీతారాములు, శాఖమూరి రమేష్, బొడ్డు బొందయ్య, కట్టికోల నాగార్జున, అడపాల రామారావు, బచ్చలకూరి నాగరాజు, కుక్కల హనుమంతరావు, రాయపూడి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఐలమ్మ ఆశయాలు సాధించాలి



కేఎంసీలో చాకలి ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మం కార్పొరేషన్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): చిట్యాల (చాకలి) ఐలమ్మ స్ఫూర్తితో రాష్ట్ర ప్రభుత్వం మహిళల సంక్షేమం, అభివృద్ధి కోసం మహిళా శక్తి పథకాలను ప్రవేశ పెడుతుందని ఖమ్మం నగర పాలక సంస్థ మేయర్ పునుకొల్లు నీరజ పేర్కొన్నారు. శుక్రవారం ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో చిట్యాల ఐలమ్మ జయంతి కార్యక్రమాలను నిర్వహించారు. ఐలమ్మ చిత్రపటానికి మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్య, ఇతర విభాగాల పర్యవేక్షకులు పూలదండలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఐలమ్మ పోరాట చరిత్రను వివరించారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సంక్షేమానికి అనేక పథకాలను ప్రవేశ పెడుతుందని వివరించారు. ఖమ్మం నగరంలోను మహిళలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వటం జరుగుతుందన్నారు. డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్, అసిస్టెంట్ కమిషనర్ అనిల్, పట్టణ ప్రణాళిక అధికారి గందం వసుందర, ఉద్యన అధికారి బెల్లం రాధిక, ఆర్వో యాకూబ్‌పాషా పాల్గొన్నారు.

ఖమ్మం స్పోర్ట్స్: తెలంగాణ రైతాంగ పోరాటంలో తొలి అడుగు వేసిన వీరనారి చాకలి ఐలమ్మ 130వ జయంతి వేడుకలను శుక్రవారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, నాయకులు తిరుమలరావు, సుగుణారావు, షకీనా, కర్నాటి కృష్ణ, మక్బూల్ తదితరులు ఉన్నారు.

నేలకొండపల్లి: తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, భూస్వాములు, దొరల పెత్తనాన్ని ప్రశ్నిస్తూ బందూకుతో ఎదురు నిలిచి పోరాడిన ధీర వనిత చాకలి ఐలమ్మ 130 జయంతి వేడుకలు శుక్రవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. బీజేపీతో పాటు పలు రాజకీయ పార్టీలు ఐలమ్మ జయంతి వేడుకలను ఘనంగా జరిపారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఖమ్మం అర్బన్: చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని నేటి యువత అందిపుచ్చుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సింగు నర్సింహారావు పిలుపునిచ్చారు. శుక్రవారం సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పాత బస్టాండ్ ప్రాంతంలోని ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐలమ్మ లాంటి ఎందరో యోధుల త్యాగాలతో నిజాం పాలన అంతమయ్యిందన్నారు. హక్కుల సాధనకు, సమస్యల పరిష్కారానికి పోరాటాలు నేటి తరంలోనూ అనివార్యం అన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు తాటి వెంకటేశ్వరరావు, నాయకులు గాదె లక్ష్మీనారాయణ, నూనె శశిధర్, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.



సీపీఐ ఆధ్వర్యంలో...



నేలకొండపల్లిలో...



బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో...

నిబంధనలు పాటించాలి

▸ డీఎంహెచ్‌వో డాక్టర్ కళావతిబాయి



రిజిష్టర్లను తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో కళావతిబాయి

ఖమ్మం కలెక్టరేట్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేటు ఆస్పత్రులు ప్రభుత్వ నిబంధనలకు లోబడి నిర్వహించాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. కళావతిబాయి అన్నారు. శుక్రవారం ఆమె ఖమ్మంలోని సాయి నర్సింగ్ హోంను ఆకస్మిక తనిఖీ చేశారు. హాస్పిటల్లో ఉన్న అవుట్ పేషెంట్ విభాగం, ల్యాబ్, ఆపరేషన్ థియేటర్, రికార్డులను పరిశీలించారు. ఆసుపత్రిలో ఉన్న రోగులతో మాట్లాడి ఇక్కడి వైద్యసేవలు, సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో అందించే వైద్య సేవల ధరల వివరాలను నోటీస్ బోర్డులో ప్రదర్శించాలని సూచించారు. ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది వివరాలు రిజిస్ట్రేషన్ సమయంలో సమర్పించిన వివరాలతో సరిపోయాయా, లేదా పరిశీలించారు. క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ ఆక్ట్ ప్రకారం నిబంధనలను పాటించాలని, అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని అన్నారు. ఈ తనిఖీల్లో, ప్రో గ్రాం ఆఫీసర్, అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ, ప్రైవేట్ ఆసుపత్రి బాధ్యులు డాక్టర్. నారాయణ, డా. పద్మావతి ఉన్నారు.

కూలిపోయిన బ్రిడ్జి

▸ అవస్థలు పడుతున్న ప్రజలు ▸ పట్టించుకోని అధికారులు



రాకాసితండా వద్ద కూలిన ఆకేరు బ్రిడ్జి(ఫైల్)

తిరుమలాయపాలెం, సెప్టెంబరు26(ఆంధ్రజ్యోతి): గతేడాది కురిసన భారీవర్షాలు, వరదలతో మండలం అంతా అతలాకుతలం అయింది. గతంలో కురిసిన వర్షానికితోడు ఎగువనుంచి వరద రావడంతో ఆకేరు ఉగ్రరూపందాల్చిది. దీంతో వారధులు కూలి, కొన్ని కొట్టుకుపోయాయి. మండలంలోని హైదరసాయిపేట సమీపంలోని రాకాసితండా వద్ద సుమారు రూ.16కోట్లతో బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో బ్రిడ్జి నిర్మించారు. దీంతో మహబూబాబాద్, ఖమ్మం జిల్లా సరిహద్దు గ్రామాలకు రవాణా సులభమైంది. గతేడాది భారీవర్షాలతో బ్రిడ్జి మొత్తం కొట్టుకుపోయింది. ఏడాది కాలం నుంచి రావిచెట్టుతండా వద్ద బ్రిడ్జి నిర్మాణం లేకపోవడంతో ఖమ్మం-మహబూబాబాద్ జిల్లాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం ఇటీవల బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేసినా టెండర్లు కాకపోవడంతో పనులు చేపట్టలేదు. సోమవారం పడమటితండాకు చెందిన గుగులోత్ రాములు అనే రైతు ఆకేరు వాగు దాటుతుండగా ప్రమాదవశాత్తు ఆకేరులో పడి మృతిచెందాడు. ఇలాంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నిరుపయోగంగా బస్ షెల్టర్

▸ ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



రహదారి పక్కన ఉన్న బస్‌షెల్టర్



షెల్టర్ లేక ఎండలో నిల్చున్న ప్రయాణికులు

ఖమ్మం అర్బన్ సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): బస్ షెల్టర్ నిరుపయోగంగా మారడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు.. కొన్ని చోట్ల సదుపాయం లేక ప్రయాణికులు సతమతమవుతుండగా ఖమ్మం నగరంలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది.. ఏర్పాటు చేసిన బస్ షెల్టర్‌ను నిరుపయోగంగా మార్చటంతో ప్రయాణికులు వానకు తడుస్తూ సమస్యలకు గురవుతున్నారు. స్థానిక ఇల్లెందు క్రాస్ రోడ్డువద్దగల ఐటీ హబ్ ప్రాంతం నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉంటుంది.. వైరా వైపు వెళ్లే ప్రయాణికులు బస్సులను ఏక్కేందుకు దిగేందుకు ఈ ప్రాంతం అడ్డాగా ఉంది. ఆకారణంగా ఈప్రాంతంలో బస్ షెల్టర్‌ను ఏర్పాటు చేశారు.. ఈబస్ షెల్టర్‌ను ఇనుప కమ్మీలతో ఏర్పాటు చేయడంతో ఇటీవల అక్కడ సైడ్ డ్రైన్ విస్తరణ కోసం బస్ షెల్టర్‌ను తొలగించి పక్కన పెట్టారు. డ్రైన్ నిర్మాణం పూర్తయినప్పటికీ తొలగించిన బస్ షెల్టర్‌ను యథాస్థానంలో ఏర్పాటు చేయక పోవటంతో స్థానికంగా ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు విస్తృతంగా కురుస్తుండటంతో ప్రయాణికులు తలదాచుకునేందుకు వసతి లేక ఉరుకులుపరుగులు తీస్తున్నారు. ముఖ్యంగా మహిళలు, పిల్లలు వర్షాలకు తడవాల్సి వస్తోంది. అధికారులు ఇకనైనా స్పందించి బస్ షెల్టర్‌ను వినియోగంలోకి తేవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

బీసీల పట్ల కాంగ్రెస్ చిత్తశుద్ధితో ఉంది

▸ ఎమ్మెల్యే మట్టా రాగమయి, డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్



మాట్లాడుతున్న సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి

ఖమ్మంచర్చికాంపౌండ్, సెప్టెంబరు26(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ బీసీల పట్ల చిత్తశుద్ధితో ఉందని, కాంగ్రెస్ పార్టీ తీసుకున్న నిర్ణయానికి చివరివరకు కట్టుబడి ఉండి బీసీలకు న్యాయం చేసేందుకు ముందుంటామని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం ఖమ్మంనగరంలోని కలెక్టరేట్ వద్దగల ధర్నాచౌక్‌లో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్ చేపట్టిన ఆమరణ నిరాహారదీక్షకు వారితో పాటు బీఆర్‌ఎస్ నాయకుడు గుండాల కృష్ణ, పలువురు నాయకులు హాజరై సంఘీభావం తెలిపారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బీసీలను నిర్లక్ష్యం చేస్తే రానున్న ఎన్నికల్లో ఆపార్టీలకు తగిన గుణపాఠం చెబుతామన్నారు. బీసీలకు న్యాయం చేసేంతవరకు పోరాటాలు చేస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోడేపల్లి కృష్ణమాచారి, ఉద్యమకారుల ఫోరం చైర్మన్ డాక్టర్ కేవీ కృష్ణారావు, మనసం శివరామకృష్ణ, గద్దె వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలని ధర్నా

ఖమ్మం అర్బన్ సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ కార్మికులకు ప్రభుత్వం బకాయి పడ్డ నాలుగు నెలల వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు తుమ్మా విష్ణువర్ధన్ మాట్లాడుతూ పంచాయతీ వర్కర్స్ బకాయి వేతనాలను దసరా పండుగ లోగా వారి ఖాతాల్లో జమ చేయాలన్నారు. తెలంగాణలో అతి పెద్ద పండుగైన దసరా పండుగను చేసుకోలేని దుస్థితి గ్రామపంచాయతీ కార్మికులకు వాటిల్లిందన్నారు. పండుగనాడు పస్తులుండాల్సిన అగత్యం ఏర్పడిందన్నారు. ఏనెలకానెల గ్రీన్ చానెల్ ద్వారా పంచాయతీ కార్మికుల వేతనాలు చెల్లిస్తామని కల్లబొల్లి మాటలు చెప్పిన ప్రభుత్వం, ఇప్పుడు దాటవేత వైఖరి అవలంబిస్తుండటం బాధాకరం అన్నారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి జీవో 51 సవరించి కేటగిరి వారీగాపనుల కేటాయింపు జరపాలన్నారు. కార్మికులతో వెట్టి చాకి రీ చేయిస్తూ ప్రభుత్వం వారి సమస్యల పరిష్కారం విషయంలో మొం డిగా వ్యవహరిస్తోందన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్ కార్యాలయ ఏవోకు అందజేశారు. ధర్నాలో తెలంగాణ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు హుస్సేన్, వి.సుధాకర్ రెడ్డి, పుల్లయ్య, నాగేశ్వరరావు, నరేష్, ఆళ్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు


ఘనంగా మహా చండీయాగం

నేలకొండపల్లి, సెప్టెంబరు26(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని భైరవునిపల్లి గ్రామంలోని శ్రీప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో శుక్రవారం మహా చండీయాగాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు జొన్నాభట్ల ప్రసాదశాస్త్రి ఆధ్వర్యంలో మహా చండీక్రతువు చేపట్టారు. దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా ఐదవ రోజు అమ్మవారు చండీ అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ చైర్మన్ గోళ్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆలయ ప్రాంగణంలో గత 21 ఏళ్లుగా దుర్గాదేవీ శరన్నవరాత్రులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



భైరవునిపల్లిలో మహాచండీ యాగం చేస్తున్న వేద పండితులు

గొడవర్తి రామారావు కన్నుమూత



రామారావు పార్థీవదేహం వద్ద నివాళులర్పిస్తున్న చాంబర్ ఆఫ్ కామర్స్ బాధ్యులు

ఖమ్మం మార్కెట్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఖమ్మం వ్యవసాయ మార్కెట్ సీనియర్ వ్యాపారస్తుడు, మాజీ ఉపాధ్యాయుడు గొడవర్తి రామారావు(పంతులుగారు)(82) శుక్రవారం తెల్లవారుజామున ఆనారోగ్యంతో మృతి చెందారు. ఆయన పార్థీవ దేహాన్ని ఛాంబర్ ఆఫ్ కామర్స్ బాధ్యులు చిన్ని క్రిష్ణారావు, మెంతుల శ్రీశైలం, జీవై నరేష్, మన్నెం కృష్ణ, తల్లాడ రమేష్, దిరిశాల వెంకటేశ్వర్లు, ముత్యం ఉప్పల్‌రావు, మాటేటి నాగేశ్వరరావు, యడ్లపల్లి సతీష్, నల్లమల ఆనంద్, సిరికొండ వెంకటేశ్వర్లు, బండి సతీష్, సోమారపు సుధీర్, కురువెళ్ళ ప్రవీణ్‌కుమార్ తదితరులు సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అదే విధంగా బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు, నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు రామారావు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.



ఆంధ్రజ్యోతి

ZONE

శనివారం 27 సెప్టెంబరు 2025

- మధిర, ఎర్రుపాలెం, బోనకల్, చింతకాని, ముదిగొండ
- వైరా, కొణిజర్ల, కారేపల్లి, ఏన్కూరు, జూలూరుపాడు
- సత్తుపల్లి, కల్లూరు, తల్లాడ, వేంసూరు, పెనుబల్లి

8

వైరా-మధిర

సత్తుపల్లి

WYRA, MADHIRA, SATHUPALLY

కరెన్సీ నోట్లతో అమ్మవారికి అలంకరణ



తల్లాడ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): తల్లాడలోని కోటమైసమ్మ దేవాలయంలో శుక్రవారం రూ.10నుంచి రూ.100కరెన్సీ నోట్లతో మహాలక్ష్మీదేవిగా అమ్మవారిని అలంకరించారు. దసరా సందర్భంగా అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని కుర్నవల్లికి చెందిన వనమా లీలావతి జ్ఞాపకార్థం దేవాలయానికి 50కుర్చీలు అందించారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు లగడపాటి నెహ్రూ, మాధవ, ప్రధాన అర్చకుడు సతీష్‌శర్మ పాల్గొన్నారు.

రేపు వేంసూరులో పశువైద్యశిబిరం



మాట్లాడుతున్న డాక్టర్ రాజశేఖర్

వేంసూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ రేబీస్ దినోత్సవం సందర్భంగా ఈనెల 28న వేంసూరులో ఉదయం 8.30గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు పశువైద్యశిబిరం నిర్వహించనున్నట్లు మండల పశువైద్యాధికారులు డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ షేక్.సఫియా తెలిపారు. ఈ శిబిరంలో పెంపుడు కుక్కలకు, పిల్లులకు ఉచితంగా యాంటీ రేబీస్ టీకాలు వేయడం జరుగుతుందన్నారు. సంబంధిత యజమానులకు జంతువుల పెంపకంలోఅవగాహన కల్పించనున్నట్లు చెప్పారు.

రోజు కూలీల సమస్యల పరిష్కారానికి ఆందోళన



తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళనచేస్తున్న డైలీ వర్కర్లు

కారేపల్లి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): హాస్టల్‌ల లో డైలీవర్కర్లుగా పనిచేస్తున్న వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద మండల సీఐటీయూ కన్వీనర్ కె.నరేందర్ ఆధ్వర్యంలో వర్కర్లు ఆందోళన నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ ఏ.రమేష్‌కు వినతిపత్రం అందచేశారు. మాతృనంద, పద్మ, రాధా, గురవమ్మ, కృష్ణ, సారంగి, కోటమ్మ, సుభద్ర, బావ్‌సింగ్, వెంట్రాం పాల్గొన్నారు.

పంచాయతీ ట్రాక్టర్‌కు డీజిల్ వితరణ



ట్రాక్టర్‌కు డీజిల్ పోయిస్తున్న నాగరాజు

వైరా, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాటిపూడి గ్రామ పంచాయతీ పరిధిలో అస్తవ్యస్తంగా ఉన్న పారిశుధ్యాన్ని మెరుగుపర్చేందుకు అక్కడి కాంగ్రెస్ నాయకుడు జవ్వాజి నాగరాజు ముందుకొచ్చారు. డీజిల్ లేక పంచాయతీ ట్రాక్టర్ మూలనపడి ఉండడాన్ని గమనించి అందుకు అవసరమైన డీజిల్‌ను పోయించారు. ప్రతి వార్డులో ట్రాక్టర్ ద్వారా చెత్త సేకరణ కార్యక్రమం చేసేందుకు ఆ ట్రాక్టర్‌కు వారంలో రెండురోజులకోసారి డీజిల్‌ను అందిస్తున్నారు. ఫాగింగ్ మిషన్లకు మరమ్మతులు చేయించారు.

సీసీ రోడ్డుకు మరమ్మతులు



మరమ్మతులు పర్యవేక్షిస్తున్న చింతకాని ఎస్‌ఐ వీరేందర్

చింతకాని, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): చింతకాని మండల కేంద్రంలో సొసైటీ వద్ద సీసీ రోడ్డుపై కాంక్రీటు పోయి ఇనుప చువ్వలు పైకి వచ్చి వాహనదారులకు ఇబ్బందిగా మారి, ప్రమాదాలు చోటు చేసుకుంటుండటంతో శుక్రవారం ఎస్‌ఐ ఎన్.వీరేందర్ ఆధ్వర్యంలో మరమ్మతులు చేపట్టారు. చువ్వలు తేలిన చోట కాంక్రీటు మిక్సర్‌తో మరమ్మతులు నిర్వహించారు. పోలీస్ సిబ్బంది స్వచ్ఛందంగా మరమ్మతులు నిర్వహించడంతో ఆ గ్రామ ప్రజలు పోలీసులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

ముదిగొండ పీహెచ్‌సీలో దంత వైద్యశిబిరం



దంత సమస్యలపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి అరుణాదేవి

ముదిగొండ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య మహిళా శక్తివంతమైన కుటుంబం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ప్రత్యేక దంత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులను పరీక్షించి మందులను పంపిణీ చేశారు. దంత సమస్యలపై పలు సూచనలను చేశారు. కార్యక్రమంలో దంత వైద్యనిపుణులు అశోక్‌కుమార్, పీహెచ్‌సీ వైద్యురాలు అరుణాదేవి, ఆయూష్ హోమియో వైద్యాధికారి నస్రీన్ జహాన్, సీహెచ్‌వో మధుసూదన్‌రావు, ల్యాబ్ టెక్నీషియన్ రెడ్డిబోయిన రామారావు, లత, పద్మావతి పాల్గొన్నారు.

ఘనంగా అక్షరాభ్యాస కార్యక్రమం



అక్షరాభ్యాసం, సీమంతాలు నిర్వహిస్తున్న దృశ్యం

ఏన్కూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పోషణమాసం సందర్భంగా తిమ్మరావుపేట సెక్టార్ పరిధిలోని బురదరాఘవాపురం అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం అక్షరాభ్యాసం, సీమంతాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ బక్కమ్మ మాట్లాడుతూ.. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలుకలిగిన ఆకుకూరల గురించి, చిరుధాన్యాలు, మొలకెత్తిన పెసలు, బొబ్బర్లు, వేరుశనగలు తినడం వల్ల ఐరన్ ఎక్కువగా లభిస్తుందని తెలిపారు. అంగన్‌వాడీ టీచర్ సుజాత, శోభనకుమారి, హైమావతి, వెంకటలక్ష్మి, ఆంధ్రావాణి, ఆయాలు జ్యోతి, పద్మశిరోమణి పాల్గొన్నారు.

వీరనారి చాకలి ఐలమ్మ

జయంతి కార్యక్రమాల్లో పలువురు వక్తలు

భూమి కోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ అని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. శుక్రవారం ఆమె 130వ జయంతిని పలు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తెలంగాణ అంటేనే ఒక తెగువని దానికి నిదర్శనం చాకలి ఐలమ్మనని 15వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్ కమాండెంట్ ఎస్.పెదబాబు అన్నారు. సాయుధ పోరాటంలో మడమ తిప్పని యోధురాలని కల్లూరు సబ్‌కలెక్టర్ అజయ్‌యాదవ్ అన్నారు.



కారేపల్లిలో ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే



కల్లూరులో..



పెనుబల్లిలో..



వైరాలో..



సత్తుపల్లి బెటాలియన్‌లో..



మధిరలో..



ముదిగొండలో..

ప్రభుత్వ కళాశాలంటే చిన్నచూపు వద్దు

సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కళాశాలలు అంటే చిన్న చూపు వద్దని, మహనీయులు అంతా ఒకప్పుడు ప్రభుత్వ విద్యను అభ్యసించిన వారేనని సత్తుపల్లి ఎమ్మెల్యే డా.మట్టా రాగమయి అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన పేరెంట్స్ మీటింగ్‌లో ఆమె పాల్గొన్నారు. మంచి భవిష్యత్తును చేతులారా నాశనం చేసుకోవద్దని, అన్నీ సాధించుకున్నాం... పెద్దవాళ్లం అనే భావన వద్దని, తల్లీదండ్రుల ఆశలను నెరవేర్చేలా మీరంతా నడుచుకోవాలన్నారు. ఒక్కసారి ఎగ్జామ్ ఫెయిల్ అయితే బాధపడాల్సిన అవసరం లేదని, ఎన్నో అవరోధాలను ఎదుర్కొని మహనీయులు ఎంతో సాధించారని, ఒక ప్రయత్నంలో రాకపోతే ఒక్కసారికే ఎవరూ నిరాశ పడొద్దన్నారు. మంచి వాతావరణంలో సమయాన్ని సద్వినియోగించుకుని ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థినీలతో కలిసి బతుకమ్మల వద్ద ఆడిపాడారు.

మన్‌మోహన్‌సింగ్‌కు నివాళులు

భారత మాజీప్రధాని డాక్టర్ మన్‌మోహన్‌సింగ్ జయంతి సందర్భంగా కళాశాల ఆవరణలో ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్‌తో కలిసి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం మండలంలోని కిష్టారం ఓసీలో దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఉద్యోగులు, కార్మికులకు ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.



మన్‌మోహన్ సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే డా.రాగమయి

గ్రూప్-1కు ఫైల్‌తండా వాసి ఎంపిక



కారేపల్లి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఫైల్‌తండాకు చెందిన బాణోత్ సురేష్‌బాబు గ్రూప్-1ఫలితాల్లో 116వ ర్యాంకు సాధించి డీఎస్పీ పోస్టుకు ఎంపికయ్యారు. ఫైల్‌తండాకు చెందిన మంగ్యా, లక్ష్మీ దంపతుల కుమారుడు సురేష్‌బాబు. వీరిది వ్యవసాయ కుటుంబం. ఖమ్మం పట్టణంలోని రిక్కాబజారు ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న సురేస్‌బాబు ర్యాంకు సాధించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆశ్రమ పాఠశాలలో చదివినతాను ఈస్థాయికి చేరుకున్నట్లు తెలిపారు. గ్రామానికి చెందిన వ్యక్తి డీఎస్పీకి ఎంపిక కావడంపట్ల గ్రామస్థులు అభినందిస్తున్నారు.

విద్యతోనే కుటుంబ, సమాజాభివృద్ధి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరా, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే కుటుంబం, సమాజాభివృద్ధి చెందుతుందని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం వైరా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన పేరెంట్స్, లెక్చరర్ల జాయింట్ మీటింగ్‌లో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ మీటింగ్‌ను ఏర్పాటుచేసిన ప్రిన్సిపాల్ ఎల్.నవీనజ్యోతిని అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంపై ప్రత్యేక దృష్టిసారించి నాణ్యమైన విద్యనందించాలనే సంకల్పంతో మౌలిక వసతులకు పెద్దపీట వేస్తుందని తెలిపారు. పేరెంట్స్ లెక్చరర్ల మీటింగ్‌ను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించడం ద్వారా అనేక సమస్యల పరిష్కారానికి అవకాశం ఏర్పడిందని చెప్పారు. విద్యావంతులు, అధ్యాపకుల సూచనలు, సలహాలు ఇందుకు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్క తల్లిదండ్రి తమ పిల్లలకు విద్య చెప్పించటం ద్వారానే కుటుంబం తద్వారా సమాజం అభివృద్ధిచెందుతుందని, ఇలాంటి కార్యక్రమంలో తాను భాగస్వామి కావడం అభినందనీయంగా ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ నవీనజ్యోతి, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, టీపీసీసీ కార్యదర్శి కట్ల రంగారావు, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతారాములు, మునిసిపల్ కమిషనర్ యు.గురులింగం పాల్గొన్నారు.

ఘనంగా హోమం

తల్లాడ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): తల్లాడలోని హనుమత్ పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి దేవాలయంలో శుక్రవారం హోమం ఘనంగా నిర్వహించారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రధానర్చకులు దీవి సీతారామాచార్యులు ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, కుంభాభిమర్శనం, పల్లకీ ఉత్సవ కార్యక్రమాలునిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయకమిటీ చైర్మన్ గుర్రం శేషగిరిరావు, గుణాకర్ పాల్గొన్నారు.

ఉల్లాస్ కార్యక్రమంలో పుస్తకాల పంపిణీ

కల్లూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపడుతున్న ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వీవోఏలకు, వీవోలకు ఉల్లాస్ పుస్తకాలను ఐకేపి ఏపీఎం అశోకారాణి పంపిణీ చేశారు. నిరక్ష్యరాస్యులను అక్షరాస్యులుగా చేసేందుకు చేపట్టిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు గానూ విజ్ఞానదాయకంగా గల పుస్తకాలను పంపిణీ చేశారు. ఇలా గ్రామాల్లో నిర్వహించిన సర్వే ప్రకారం మండలంలో 2,765 మంది నిరక్షరాస్యులు ఉన్నట్లుగా గుర్తించగా వారికి 275 మంది వాలింటీర్లు, 29 మంది గ్రామ సమైక్యలతో అక్షరాస్యత కార్యక్రమాన్ని కొనసాగించేలా ఏర్పాట్లు చేసినట్లు ఏపీఎం తెలిపారు. 2026 ఫిబ్రవరి నెల కల్లా ఈ కార్యక్రమాన్ని పూర్తి చేసినట్లు చెప్పారు.



పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఐకేపి ఏపీఎం అశోకారాణి

కుల, మత దాడులకు వ్యతిరేకంగా పోరాడుదాం



పట్టణంలో ర్యాలీతీస్తున్న సీపీఎం నాయకులు

సత్తుపల్లి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): దేశంలో జరుగుతున్న కుల మతోన్మాద దాడులకు వ్యతిరేకంగా పోరాడాలని, మూఢ విశ్వాసాలను అరికట్టాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం స్థానిక నీలం రామచంద్రయ్య భవనంలో మహాత్మాజ్యోతిబాఫూలే స్థాపించిన సత్యశోధక ఏర్పడి 152సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఏర్పాటు చేసిన కుల నిర్మూలన సదస్సులో ఆయన పాల్గొన్న అనంతరం పట్టణంలో ర్యాలీతీశారు. ఏ దేశంలో లేనటువంటి కుల వ్యవస్థలు, రుగ్మతలు మనదేశంలో ఉన్నాయని, పూలే కుల వ్యవస్థకు వ్యతిరేకంగానూ దాని నిర్మూలనే లక్ష్యంగా పనిచేశారన్నారు. కులమత బేధాలు సృష్టిస్తూ ప్రజల మధ్య చిచ్చుపెట్టేలా రాజకీయ నాయకులు తీవ్రంగా కృషి జరుపుతున్నారని, దీనిని ఎండ కట్టాల్సిన బాధ్యత ప్రజలపైనే ఉందన్నారు. కార్యక్రమంలో ఏ.వెంకన్న, గంటా శ్రీను, అమర్లపూడి శరత్, కొర్సా వెంకటేష్, ఒగ్గు నాగిరెడ్డి, దుంపా రాఘవులు, నడకుదురు భాస్కర్, కందిమళ్ల నాగప్రసాద్, పాండ్ల దుర్గ, అలివేలు, కృష్ణవేణి, వరలక్ష్మీ, మారుతి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి కుంకుమ పూజలు

కల్లూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) మండలంలోని పలు గ్రామంల్లో శ్రీదేవి శరన్నవ రాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి ఘనంగా మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. మహాలక్ష్మి అవతారంలో అమ్మవారిని అలంకరించారు. ఆయా పూజ కార్యక్రమాల్లో భవానీ భక్తులు కళ్యాణపు కొండల రావు, నవ్య తదితర భక్తులు పాల్గొన్నారు.

బోనకల్: దేవి శరన్నవ రాత్రుల ఉత్సవాలలో భాగంగా బోనకల్‌లో సొసైటీ వద్ద ఏర్పాటు చేసిన దుర్గా మాత విగ్రహం వద్ద శుక్రవారం అత్యంత భక్తి, శ్రద్ధలతో కుంకుమ పూజా అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

ఎర్రుపాలెం: మండలంలో జమలాపురం శ్రీ వేంకటేశ్వర ఆలయంతోపాటు అన్ని గ్రామాల్లో దసరా నవరాత్రుల్లో భాగంగా శుక్రవారం మహాలక్ష్మి అలంకారంలో భక్తులు పూజలు నిర్వహించారు. సామూహిక కుంకుమార్చనలు, శ్రీసూక్తం, లక్ష్మిసూక్తం, పారాయణలు, మహాలక్ష్మిఅష్టకం, ఖడ్గమాల స్తోత్రాలతో ప్రత్యేకంగా అర్చనలు నిర్వహించారు. భక్తులకు ఋణబాధలు తొలిగి అష్టైశ్వర్యాలు, ఆరోగ్యం కలుగుతాయని భక్తులు ప్రగాఢ విశ్వాసం

గ్రామ సుభిక్షానికి.. భవానీ దీక్ష..

పి.లోవకరం మాజీ సర్పంచ్ కొండల రావు దంపతులు, దాతల ఔదార్యం



కల్లూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పాడి పంటలతో గ్రామ ప్రజలు సుభిక్షంగా ఉండాలని, దుర్గాదేవిని ఆరాధిస్తూ కల్లూరు మండలంలోని పడమట లోకవరం గ్రామానికి చెందిన 40 మంది భక్తులు భవాని దీక్షమాల చేపట్టారు. పడమట లోవకరం గ్రామంలో ఈ దీక్షల నిర్వహణకు ఆ గ్రామ మాజీ సర్పంచు కళ్యాణపు కొండల రావు, నవ్య దంపతులు తమ వంతుగా ఆర్థిక సహకారం అందిస్తూ ఆధ్యాత్మీక సేవలో ఆదర్శంగా నిలిచారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పడమట లోకవరం గ్రామంలో దేవి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆ గ్రామ మాజీ సర్పంచు కళ్యాణపు కొండలరావు-నవ్య దంపతుల స్ఫూర్తికి నిదర్శంగా (మహిళ, పురుష)40 మంది కలిసి సామూహికంగా భవాని దీక్షమాల ధరించారు. ప్రతి రోజు ఉదయం, సాయింత్రం దుర్గాదేవి ప్రత్యేక అలంకరణ పూజలతో పాటుగా మాలధారులకు ఆ దంపతులు, దాతలు ఆధ్యాత్మికంగా ముందుకు వచ్చి సహాయ సహకారాలు అందిస్తున్నారు. ఇలా భవాని దీక్షమాలధారులతో పటమట లోవరం గ్రామం ఈ దసరా ఉత్సవాల సందర్భంగా ఆధ్యాత్మీక శోభను సంతరించుకుంది. ఈ దీక్షలు 11 రోజులతో ముగియనున్నాయి. ఈ సందర్భంగా పి.లోకవరంలో దసరా ఉత్సవాల సందర్భంగా భవాని దీక్ష పరులు ఘనంగా కుంకుమ పూజలు చేశారు.



పూజలు చేసున్న భవానీ దీక్షధారులు

పోరాటాలతో మహిళలు హక్కులు సాధించుకోవాలి

ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి

బోనకల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మహిళలు పోరాటాల ద్వారానే హక్కులు సాదించుకోవాలని, తమ సంఘం ఆధ్వర్యంలో చేసిన పోరాటాల ద్వార పలు హక్కులు సాదించామని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మీ తెలిపారు. మండలంలోని ముష్టికుంట్ల గ్రామంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన ఆ సంఘ మధిర డివిజన్ మహాసభలో ఆమె మాట్లాడుతూ మహిళలు శాస్త్ర, సాంకేతిక రంగాలలో పురుషలతో సమానంగా రాణిస్తున్నారని పేర్కొన్నారు. బీజేపీ పాలనలో మహిళలకు రక్షణ కరువైందన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యతో పాటు ధరల పెరుగుదలతో సామన్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళల హక్కులకు భంగం వాటిల్లుతుందన్నారు. మహిళలు హక్కుల సాధనలో ముందుండాలని కోరారు. అనంతరం ఐద్వా డివిజన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా జొన్నలగడ్డ సునిత, పయ్యావుల ప్రభావతిలు ఎన్నిక కాబడ్డారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా, మండల నాయకులు బుగ్గవీటి సరళ, మెరుగు రమణ, బండి పద్మ, మడిపల్లి గోపాల రావు, కిలారు సురేష్, కొంగర వెంకట నారాయణ, వెంకటరాజ్యం తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి